


GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 221 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శుక్రవారం 21 నవంబర్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్




## గవర్నర్లు, రాష్ట్రపతికి
# గడువు విధించలేం

- గవర్నర్లకు మూడు అంశాల్లోనే నిర్ణయం
- సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు



**న్యూఢిల్లీ,నవంబర్20(సమయజ్యోతి):**

గవర్నర్,రాష్ట్రపతి అధికారాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించటం తగదని స్పష్టం చేసింది. కారణం చెప్పకుండా గవర్నర్‌లు బిల్లులను వెనక్కి పంపలేరని తెలిపింది. బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు లేదని కూడా తేల్చి చెప్పింది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపితేనే రాష్ట్రపతి చర్యలు తీసుకోగలరని చెప్పింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారం ఉందని వెల్లడించింది. తన ముందుకు వచ్చిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తారని తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో తుది అధికారం ఎన్నుకోబడిన మంత్రివర్గాని దేనని స్పష్టం చేసి



## బీహార్ సిఎంగా
# నితీశ్ ప్రమాణం

- 27మంది మంత్రులు కూడా ప్రమాణం
- ప్రమాణం చేయించిన గవర్నర్
- హాజరైన మోడీ, అమిత్ షా, చంద్రబాబు

**పాట్నా,నవంబర్ 20(సమయజ్యోతి):**

బిహార్ సీఎంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సిఎంగా ఆయన ప్రమాణస్వీకారం చేయడం ఇది పదోసారి. పట్నాలోని గాంధీ మైదానంలో నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హాలకు డిప్యూటీ సీఎం పదవులు దక్కాయి. గవర్నర్ అరీఫ్ మహ్మద్ ఖాన్ సిఎం, మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు.

02

## తిరుపతి చేరుకున్న రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం

తిరుచానూరులో పద్మవాతి అమ్మవారి దర్శనం

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న ముర్ము

**తిరుమల,నవంబర్ 20(సమయజ్యోతి):**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత, టీటీడీ ఉన్నతాధికారులతోపాటు కూటమిలోని పార్టీల నేతలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా తిరుచానూరుకు రాష్ట్రపతి చేరుకున్నారు. తిరుచానూరులో కొలువు తీరిన శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.



02

# పెట్టుబడులకు హైదరాబాద్ వేదిక

### తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌లో రేవంత్

**హైదరాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి)**



పెట్టుబడులకు హైదరాబాద్ వేదికగా మారిందని, తాము పక్క రాష్ట్రాలతో కాకుండా దుబాయ్, సింగపూర్ లాంటి దేశాలతో పోటీ పడతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ వేదికగా 6 రోజుల పాటు రెండు విడతలుగా జరిగే తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావ్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వివిధ రంగాల్లో దూసుకుని పోయేలా కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని అన్నారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. తెలంగాణతో పాటు పాటు 8 ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 600 మంది పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో మొదటి దశ ఫెస్టివల్‌లో సినిమాలు, సాహిత్యం వంటి అంశాలపై సెమినార్లు, చర్చా గోష్టిలు, ప్రదర్శనలు ఉంటాయని, 25 నుంచి 27 వరకు సాగే 2వ విడతలో ఆరోగ్యం, సాంకేతికత వంటి అంశాలపై చర్చలు ఉంటాయని చెప్పారు. రోజూ 2వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, 40 మంది పౌర పురస్కార విజేతలు కూడా దీనికి హాజరవుతారని గవర్నర్ కార్యాలయ కార్యదర్శి దాన కిశోర్ తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వారసత్వం ఇచ్చి పుచ్చుకోవడానికే కాదు ఒకరి ఉత్పత్తులు మరొకరు అమ్మడానికి, కొనడానికి దోహదం చేస్తుందని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. సంస్కృతి, సహజ వనరుల పరంగా ఈశాన్య రాష్ట్రాలు ఎంతో గొప్పవని.. మన దేశం అతిథి దేవో భవ అంటే వారు అభివృద్ధి దేవో భవ అంటున్నారని తెలిపారు. సంక్షేమ ఫలాలు అందరికీ చేరడమే అసలైన అభివృద్ధి అన్నారు. తొలి రోజు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన కళాకారులకు గవర్నర్ బహుమతులు అందజేశారు. మిజోరాం యువజన సర్వీసులు, క్రీడల మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి సన్మానించారు.

# సిఎం రేవంత్‌తో అనలాగ్ సిఇవో భేటీ

### పలు అభివృద్ధి పథకాలపై చర్చ



**హైదరాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనలాగ్ ఎఐ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అలెక్స్ కిప్‌మాన్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణను భవిష్యత్ నగరాల దిశగా తీసుకెళ్లడానికి చేపడుతున్న ఏఐ సిటీ ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాల్లో తర్వాతి తరం 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' సిస్టమ్‌లను ఎలా అనుసంధానించొచ్చన్నది ఈ సమావేశంలో చర్చించారు. సీఎం రేవంత్ రెడ్డి అభ్యర్థన మేరకు తమ ఆధునిక సాంకేతిక ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించి హైదరాబాద్ నగరం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ట్రాఫిక్ రద్దీ, పట్టణ వరదలు, వాతావరణ మార్పుల అంచనా వంటి అంశాలను పరిష్కరించడంలో సహకరించేందుకు అంగీకారాన్ని తెలిపింది. ఈ పరిష్కారాలు నగర పాలనను స్మార్టుగా మార్చడంలో కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా రాబోయే డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు హాజరయ్యేలా కిప్‌మాన్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

# అమెరికా అభివృద్ధిలో వలసదారుల పాత్ర ఎనలేనిది

### టెక్ రంగంలో వారి పాత్ర అద్భుతం: సుందర్ పిచాయ్

**న్యూఢిల్లీ,నవంబర్ 20(సమయజ్యోతి):**

అమెరికాలో సృజనాత్మకతకు వలసదారులు చోదకశక్తిగా ఉన్నారని ఆల్ఫాబెట్ (గూగుల్ మాతృసంస్థ) సీఈఓ సుందర్ పిచాయ్ ప్రశంసించారు. టెక్ రంగంలో వలసదారుల పాత్ర అద్భుతమని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు హెచ్-1బీ వీసా విధానం రద్దుకు పట్టుబడుతున్న నేపథ్యంలో ఆల్ఫాబెట్ సీఈఓ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా టెక్ రంగంలో వలసదారుల పాత్రపై ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ బీబీసీ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

02

## హిందూసమాజాన్ని వేదనకు గురి చేసిన రాజమౌళి

క్షమాపణలు చెప్పకుంటే

సినిమాలు ఆపేస్తాం

విశ్వహిందూ పరిషత్ క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్

**హైదరాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి):**

హనుమంతుడుపై టాలీవుడ్ సినీ దర్శకుడు ఎస్‌ఎస్ రాజమౌళి చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పకపోతే.. కచ్చితంగా ఆయన సినిమాలు ఆపేస్తాం అంటూ విశ్వహిందూ పరిషత్ హెచ్చరించింది. తండ్రి మనోభావాలను సైతం కించపరుస్తూ మాట్లాడారని విశ్వహిందూ పరిషత్ తెలుగు రాష్ట్రాల క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

02

# స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక



డిసెంబర్ 11లోపు నోటిఫికేషన్‌కు ఛాన్స్

పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి

**హైదరాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి):**

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. డెడికేటెడ్ కమిషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈనెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ పక్రియను పూర్తి చేయనుంది. ఈనెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది.

# కండువా ఊపుతూ హుషారెత్తించిన మోడీ

### సోషల్ మీడియాలో ట్రెండిగ్

**పాట్నా,నవంబర్ 20(సమయజ్యోతి):**



02

ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యారు. . బిహార్‌లో ఎన్డీయే విజయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్న ప్రధాని మోదీ, 'గంచా మూమెంట్' తీసుకొచ్చారు. మెడలోని కండువా తీసి తలపై గుండ్రంగా తిప్పుతూ జనాన్ని ఉర్రూతలూగించారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ప్రధాని ఉదయం నుంచీ చాలా ఉత్సాహంగా కనిపించారు.

మొదటిపేజీ తరువాయి

# బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడీయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు. పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నితీశ్ రాజకీయంలో ఎంతో అనుభవం ఉన్న నాయకుడు. రాష్ట్రంలో మంచి పాలన అందించిన వ్యక్తి అనే అద్భుతమైన రికార్డు ఆయనకు ఉందని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

మొదటిపేజీ తరువాయి

# తిరుపతి చేరుకున్న రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం

అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారి తీర్థ ప్రసాదాలను రాష్ట్రపతికి వేద పండితులు అందజేశారు. ఇక రాష్ట్రపతి పర్యటన సందర్భంగా తిరుచానూరు లో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. స్థానికుల రాకపోకలను నిలిపివేశారు. దాంతో స్థానికులు కొంత ఇబ్బంది పడ్డారు. ఇక తిరుచానూరు పర్యటన ముగించుకుని.. సాయంత్రం రోడ్డు మార్గం ద్వారా రాష్ట్రపతి తిరుమల చేరుకుంటారు. రాత్రికి పద్మావతి అతిథి గృహంలో ఆమె బస చేస్తారు. శుక్రవారం ఉదయం శ్రీవెంకటేశ్వర స్వామి వారిని రాష్ట్రపతి దర్శించుకోనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన నేపథ్యంలో తిరుమలలో సైతం పటిష్టమైన భద్రతాను ఏర్పాటు చేశారు. తిరుపతి పర్యటన ముగిసిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.



మొదటిపేజీ తరువాయి

# స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక

12,733 పంచాయతీ, 1,12,288 వార్డుల్లో డిసెంబరు 16 వరకు మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది. ఇదిలావుంటే వచ్చే నెల డిసెంబర్ 11వ తేదీ లోపు పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. గురువారం కామారెడ్డి జిల్లా భిక్కనూరులో జరిగిన సభలో ఆమె మాట్లాడారు. అనంతరం మండలంలోని బస్వాపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముందుగా గ్రామ పంచాయతీలకు, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉంటాయని అన్నారు. పంచాయతీ ఎన్నికలకు ముందుగా నిర్వహించకపోతే మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు ల్యాప్స్ అవుతాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న రిజర్వేషన్ల ప్రకారమే 27 శాతం బీసీ రిజర్వేషన్లతో ముందుకు పోతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు. భిక్కనూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో రూ.92.80 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క భూమిపూజ చేశారు. అనంతరం మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారికి రుణాలు మంజూరు చేస్తుందన్నారు. స్వయం ఉపాధితోపాటు వ్యాపార రంగంలో మహిళలు రాణించాలని.. ఇందుకోసం ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తోందన్నారు.

# నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

## రేపు తిరిగి పుట్టపర్తికి ముర్ము ప్రయాణం

**హైదరాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి):**

తిరుమల పర్యటన ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆమె రాజ్ భవన్‌కు వెళ్తారు. మధ్యాహ్నం భోజనం చేసి.. రాజ్ భవన్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత 3:50 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి ఆమె చేరుకుంటారు. సాయంత్రం 4.00 గంటలకు రాష్ట్రపతి నిలయం వేదికగా నిర్వహించే భారతీయ కళా మహోత్సవాన్ని రాష్ట్రపతి ముర్ము ప్రారంభిస్తారు. తిరిగి సాయంత్రం 6:15 గంటలకు ఆమె తిరిగి రాజ్ భవన్‌కు చేరుకుంటారు. రాత్రి తెలంగాణ రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ముర్ము బస చేయనున్నారు. 22వ తేదీ అంటే..శనివారం ఉదయం 9:30 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి బయలుదేరి వెళ్తారు. శ్రీ సత్యసాయి బాబా శత జయంత్యోత్సవాల్లో రాష్ట్రపతి ముర్ము పాల్గొనున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

మొదటిపేజీ తరువాయి

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించలేం

ంది. ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటంపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై స్పందిస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. రాష్టర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలపై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. బిల్లులకు సమ్మతి తెలియజేయడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం. ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపారు. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు.శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశించింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

మొదటిపేజీ తరువాయి

# అమెరికా అభివృద్ధిలో వలసదారుల పాత్ర ఎనలేనిది

'టెక్ రంగం అభివృద్ధి చెందిన తీరును మీరు ఓసారి గమనించండి..ఇందులో వలసదారుల పాత్ర చాలా గొప్పది' అని ఆయన అన్నారు. హెచ్-1బీ వీసాలో లోపాలను సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. ప్రతిభావంతులను అమెరికాకు తీసుకొచ్చే విధంగా మార్పులు ఉంటాయని తాను భావిస్తున్నట్టు తెలిపారు. పైచదువుల కోసం అమెరికాకు వెళ్లిన సుందర్ పిచాయ్.. హెచ్-1బీ వీసాతోనే తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆర్థిక, సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి వలసలు అవసరమని కూడా గతంలో ఓసారి స్పష్టం చేశారు. ఇక టెక్ రంగ వ్యాపారవేత్తలకు రాజకీయ ప్రాముఖ్యత పెరుగుతుండటంపై ఎదురైన ప్రశ్నలకు కూడా సీఈఓ సుందర్ పిచాయ్ స్పందించారు. ట్రంప్ ప్రమాణస్వీకారంలో పలువురు టెక్ రంగ నిపుణులు పాల్గొనడంపై మాట్లాడారు. 'ఏఐ సాంకేతికత ఎంతో అద్భుతమైనది. ఇది ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా కూడా ఏఐకి ఎంతో ప్రాధాన్యం ఉంది. సమాజానికి ఏఐతో ప్రయోజనాలు కలిగేలా ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి. సాంకేతికత దుర్వినియోగమయ్యే ముప్పుపై ప్రభుత్వంతో కలిసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆలోచించాలని ఆయన అన్నారు.

మొదటిపేజీ తరువాయి

# హిందూసమాజాన్ని వేదనకు గురి చేసిన రాజమౌళి

రాముడు, కృష్ణుడు, హనుమంతుడు దేవుళ్లుగా కనిపించలేదా? అని ప్రశ్నించారు. హిందూ సమాజం చూస్తూ ఊరుకోదని దర్శకుడు రాజమౌళిని రవికుమార్ హెచ్చరించారు. రాజమౌళి వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని తీవ్ర వేదనకు గురిచేశాయని పేర్కొన్నారు. 'ప్రముఖ దర్శకుడు రాజమౌళి గారు హిందూ సమాజం ముందు గల్లీ స్థాయి వ్యక్తిగా దిగజారిపోయారు. హనుమంతుడికి, మీ క్లిప్స్ రిలీజ్ అవకపోవడానికి సంబంధం ఏంటి?. కృష్ణుడు నీ దృష్టిలో జగద్గురువు కాదు. రాముడు, కృష్ణుడి, హనుమంతుడిపై మీరు చేసిన విమర్శలను విశ్వహిందూపరిషత్ ఖండిస్తుంది. మీ వ్యాఖ్యలను ధర్మ ద్రోహంగా భావిస్తాం. అంజనేయ స్వామిని నిందించడం మీకు ఫ్యాషన్‌గా మారింది. మదం, గర్వంతో మాట్లాడిన ప్రేలాపనలుగా భావిస్తాం.మీ తండ్రిని కూడా బాధించేలా మాట్లాడావు. మీ ప్రచారాలకు, మీ క్లిప్స్ కి హనుమంతుడికి సంబంధం ఏమిటి. కాసుల గర్వంతో మాట్లాడితే విశ్వహిందూ పరిషత్ క్షమించదు. బేషరతుగా హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పు. దైవాన్ని అపహాస్యం చేసేలా మీ సినిమాల్లో ఉంటే.. విశ్వహిందూ పరిషత్ ఆ సినిమాలు ఆపేస్తుంది' అని సత్య రవికుమార్ వార్నింగ్ ఇచ్చారు.

# 22న టీఎన్జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**

ఆర్మూర్ పట్టణంలో టిఎన్ జిఓ ఎస్సారెస్పీ, భీంగల్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారము జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాశెట్టి సుమన్ కుమార్, నేతికుంట శేఖర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి, సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈనెల 22న రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని రాక సందర్భంగా ఉద్యోగులు, టీఎన్జీవో నాయకులు, అన్ని శాఖల ఫోరం అధ్యక్ష కార్యదర్శులు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరూ విచ్చేసి టీఎన్జీవో మెగా సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని కోరారు.



మొదటిపేజీ తరువాయి

# కండువా ఊపుతూ హుషారెత్తించిన మోడీ

వేదిక వద్దకు చేరుకునే సందర్భంలో కూడా ప్రధాని తన కండువా గాల్లో ఊపుతూ అక్కడికి చేరుకున్న ప్రజల్ని ఉత్సాహపరిచే యత్నం చేశారు. కాగా, బిహార్‌కు పదవసారి ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా తదితర ఎన్డీయే పెద్దలు హాజరయ్యారు. పాట్నాలోని గాంధీ మైదాన్‌లో జరిగిన ఈ వేడుకకు భారీ ఎత్తున జనం హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఎం మోదీ తన కండువాతో జనాల్ని ఉత్సాహపర్చారు. ముఖ్యమంత్రి, మంత్రుల చేత గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారాలు చేయించారు. ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ (జేడీ-యూ), బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా, మరో 26 మంది మంత్రులుగా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు.

# చికిత్స కోసం ఐదు లక్షల ఎల్ఓసి అందజేత

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**

నిజామాబాద్ జిల్లా వాస్తవ్యులు పుప్పాల శ్రీధర్ అనారోగ్యంతో బాధపడుతూ సర్జరీ కోసం హైదరాబాదు నిమ్స్ హాస్పిటల్ లో చేరగా, అతని చికిత్స కోసం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి చొరవ తీసుకున్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క సహాయంతో ఐదు లక్షల ఎల్ఓసిని చికిత్స కోసం బాధితుడికి అందజేశారు. వినయ్ కుమార్ రెడ్డికి బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.



# రాష్ట్రస్థాయి క్రికెట్ కు ఎంపికైన అమరచింత క్రీడాకారుడు ఎస్. అభినయ్ తేజ.



**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి**

**అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత మండల కేంద్రానికి చెందిన ఎస్ అభినయ్ తేజ ఎస్. జి. ఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక అయ్యారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు.ఈ నెల 23 న హైదరాబాద్ లో జరగబోయే రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొననున్నాడు. అభినయ్ తేజ రాష్ట్ర స్థాయి క్రికెట్ కు ఎంపిక కావడం పట్ల మక్తల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాష్ట్ర క్రీడాల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి, టి. పి. సి. సి కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, డబ్ల్యూ టి.ఐ.టి.సి ఐ. టి. చైర్మన్ సందీప్ మక్తలా, మాజీ జడ్పీటీసీ రాజేందర్ సింగ్, సినీ నిర్మాత మహంకాళి శ్రీనివాసులు, మార్కెట్ చైర్మన్ ఎం.డి.రహమతుల్లా,మాజీ మార్కెట్ చైర్మన్ ఎస్. ఏ. రాజు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎస్. ఎం. అయూబ్ ఖాన్, విద్యాధికారి భాస్కర్ సింగ్, అమరచింత క్రికెట్ క్రీడాకారులతో పాటు తదితరులు అభినందించారు.

# ఎన్నికల కోసమే చీరలు..

## రేవంత్ రెడ్డిది మోసపు రాజకీయం



సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల రాజకీయం చేస్తున్నదని గురువారం బాల్కొండ మండల బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు ఎంఏ షహీద్ ఆరోపించారు.బతుకమ్మ పండుగలకు ఇవ్వాల్సిన చీరలు రెండు పండుగలు గడిచినా ఇవ్వకుండా ఆపి ఇప్పుడు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇస్తున్న రేవంత్ రెడ్డి మోసపు రాజకీయాన్ని తెలంగాణ ఆడబిడ్డలు గ్రహించాలని, ఓట్లు ఉంటేనే చీర, రైతు బంధువైన, బోనసైనా, ఓటు లేకుంటే ఎలాంటి పథకాలు ఉండవని, ఎలాంటి అభివృద్ధి ఉండదని మండిపడ్డారు.

# శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ పునః నిర్మాణం కోసం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని శిథిలావస్థ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునరుద్ధరణ కోసము దేవాదాయ నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారము నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్తాబాద్ నాయకులు గజ్జల రాజు, గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖను కలిసి, వినతి పత్రము అందజేయగా, దీనిపై మంత్రి సుముఖత వ్యక్తం చేశారు.



# పేదింటి పిల్లలకు దుస్తులు అందజేత

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారము చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు దంపతుల కొడుకు సాయిరాం జన్మదినాన్ని పురస్కరించుకొని పేదింటి పిల్లలకు దుస్తువులు అందజేశారు.



# 21న చలో బోరజ్ కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలి.

## - మాజీ మంత్రి జోగు రామన్న

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

పత్తి,సోయాబీన్ కొనుగోల్లలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ,అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా బోరజ్ జాతీయ రహదారి (44) పై రైతులతో కలిసి దిగ్భంధం చేస్తామనీ రైతుల పక్షాన చేస్తున్న ఈ నిరసన కార్యక్రమానికి ప్రజా సంఘాలు,రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని జిల్లా కేంద్రం ఆదిలాబాద్ లోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీమంత్రి జోగు రామన్న అన్నారు.పంట కొనుగోలు నిబంధనలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని,సీసీఐ దిగి వచ్చేవరకు,ప్రభుత్వంలో చలనం వచ్చేవరకు పోరుబాట ఆగదని హేచ్చరించారు.బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేస్తున్న ఆందోళన నిరసన కార్యక్రమాలు ఎంపీ ఇల్లు ముట్టడి,బేలలో రాస్తారోకో,బీఆర్ఎస్ నేత కేటీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో అధికారులు దిగివచ్చి పంట కొనుగోళ్ల పరిమితిని సడలించారని ఇది రైతుల విజయమని జోగు రామన్న అన్నారు.రైతులు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు.మీడియా సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాసం నర్సింగ్ రావు,దేవన్న,పోచన్న,జగదీశ్,ఫెరోజ్,అజీమ్,పోతన్న తదితరులు పాల్గొన్నారు.




# పంటల కొనుగోళ్లు పకడ్బందీగా సాగాలి

## : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో నవంబర్ 20.

జిల్లాలో పంటల కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంటల కొనుగోలు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వరి, సోయా, పత్తి, మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించి కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 14,760.56 క్వింటాళ్ల వరి ధాన్యం, 5,746 క్వింటాళ్ల సోయా, 7,715 క్వింటాళ్ల మొక్కజొన్న, 66,140 క్వింటాళ్ల పత్తి పంటను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. తగు తేమ శాతం వచ్చిన తరువాతే రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తుందని తెలిపారు. 7 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చిన రైతులు తమ వివరాలను మండల వ్యవసాయ అధికారుల ద్వారా నమోదు చేయించి, పంట ఉత్పత్తి పరిశీలన చేపట్టించుకోవాలన్నారు. ఆ వివరాలను కొనుగోలు కేంద్రాలకు అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లాలోమొత్తం 351 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యానికి వంద శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తిచేయాలని, ప్రతీ కేంద్రంలో ప్యాడి క్లీనర్లను ఉపయోగించాలని సూచించారు. కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంటల కొనుగోలులో రైతులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. పత్తి రైతుల సౌకర్యార్థం 1800 599 5779 టోల్ ఫ్రీ నెంబరు, 88972 81111 వాట్సాప్ నెంబర్లు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, మార్కెటింగ్ అధికారి గజానంద్‌తో పాటు సిసిఐ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

## అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. వేములవాడ రూరల్ మండలం ఆచంపల్లి, వెంకటాంపల్లి, నమిలిగుండుపల్లి, చందుర్తి మండలం మూడపల్లి,ఆశిరెడ్డిపల్లి, రామన్నపేట, చందుర్తి, మల్యాల, నర్సింగాపూర్, కిష్టంపేట్, జోగాపూర్, తిమ్మాపూర్ గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం పరిశీలించారు. దళారులకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంబించామని వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2389, కామన్ రకానికి రూ.2369 నిర్ణయించిదని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు ధాన్యం విక్రయించవద్దని కోరారు.



# డీజీపీ శివధర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఆన్లైన్ క్రైమ్ రివ్యూ మీటింగ్

సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, నవంబర్ 20.

2025 సంవత్సరం జనవరి నుండి సెప్టెంబర్ వరకు నెలల క్రైమ్ రివ్యూ మీటింగ్ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించబడింది.ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నేర పరిస్థితులు, కేసుల విచారణ పురోగతి, శాంతి భద్రతా చర్యలు, మహిళా–శిశు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ వంటి ముఖ్య అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు.ఈ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ హాజరై, జిల్లా నేర గణాంకాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తుల పురోగతి మరియు నేర నియంత్రణ కోసం చేపడుతున్న చర్యల వివరాలను సమర్పించారు.డీజీపీ జిల్లాల వారీగా పనితీరును పరిశీలించి, దర్యాప్తుల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, ప్రజలకు వేగవంతమైన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. మాట్లాడుతూ%ౌ%ముధోల్ మరియు బాసర ప్రాంతాల్లో కూడా రాత్రి పెట్రోలింగ్ కార్యక్రమాలను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజల భద్రత మా ప్రాధాన్యం అని పేర్కొంటూ, ఎలాంటి నేరాలకు తావులేకుండా నిర్మల్ పోలీస్ శాఖ మరింత కట్టుదిట్టమైన చర్యలను అమలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.”ఈ ఆన్లైన్ క్రైమ్ రివ్యూ మీటింగులో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ఐపీఎస్, ఇన్స్పెక్టర్లు హాజరయ్యారు.




# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

## కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి - కమ్మర్పల్లి, ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయాలు తనిఖీ

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, నవంబర్ 20

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) సన్నాహక ప్రక్రియను పొరపాట్లకు తావులేకుండా పక్కాగా పూర్తి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కమ్మర్పల్లి, ఆర్మూర్ తహసిల్దార్ కార్యాలయాలను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియ అమలు, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం కోసం చేపట్టిన చర్యలపై సమీక్ష జరిపారు. 2002 ఓటరు జాబితాతో ప్రస్తుత 2025 ఓటరు జాబితాను సరిపోల్చుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత నమూనాలో వివరాలు రూపొందించారా అని పరిశీలించారు. నిర్దిష్ట గడువు లోపు ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

కాగా, భూభారతి, గ్రామ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఇంకనూ ఏవైనా అర్జీలు పెండింగ్ లో ఉంటే, వాటిని వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఆయా మాడ్యూల్స్ లో వచ్చిన దరఖాస్తులు ఎన్ని, సాదాబైనామా అర్జీలలో ఎన్ని ఆమోదం పొందాయి, ఎన్ని దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి, పీ.ఓ.టీ భూములకు సంబంధించిన దరఖాస్తులు ఎన్ని తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సాదాబైనామా దరఖాస్తులకు సంబంధించి అర్హులైన వారు ఉన్నట్లు గుర్తిస్తే, అలాంటి వారికి తగిన న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. చిన్నచిన్న కారణాల వల్ల దరఖాస్తులను రిజెక్ట్ చేయకూడదని, క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలన జరిపి అర్హులుగా నిర్ధారణ అయిన వారి దరఖాస్తులను ఆమోదించాలన్నారు. ఒకవేళ దరఖాస్తులను తిరస్కరిస్తే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని, అవి భూభారతి మార్గదర్శకాలకు లోబడి ఉండాలన్నారు.



ఆమోదం పొందిన వాటితో పాటు తిరస్కరణకు గురైన సాదాబైనామా దరఖాస్తుల వివరాలను ఆన్లైన్ లో రెండు రోజులలోపు పూర్తి స్థాయిలో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా పలు దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి తహసిల్దార్లు ప్రస్తావించిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేస్తూ, వాటిని ఏ మాడ్యూల్ లో పరిష్కరించవచ్చు అనే అంశాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ వెంట కమ్మర్పల్లి తహసిల్దార్ ప్రసాద్, ఆర్మూర్ తహసిల్దార్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన,

## :కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, నవంబర్ 20 :

వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను గమనించి, రైస్ మిల్లులకు వెంటదివెంట తరలించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, తేమ శాతానికి లోబడిన ధాన్యాన్ని రైతులు కేంద్రానికి తెచ్చిన వెంటనే తూకం వేయించి లారీలలో లోడ్ చేసి మిల్లలకు పంపాలన్నారు. మిల్లుల వద్ద సకాలంలో ధాన్యం అన్ లోడ్ జరిగేలా పర్యవేక్షణ జరపాలని, ట్రక్ షీట్లను ఎప్పటికప్పుడు తెప్పించుకుని ఓ.పీ.ఎం.ఎస్ లో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపుల విషయంలో జాప్యానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# సంపాదకీయం

## రాజకీయమంటే హంగామా చేయడమా !

రాజకీయాలు పూర్తిగా కలుషితమయ్యాయి. నేరచరిత్ర ఉన్నవారు కూడా హంగామా చేస్తున్నారు. కోర్టులో కేసుకు హాజరు కావడం కోసం హంగామా చేయడం దారుణం కాక మరోటి కాదు. దానికోసం పోలీసులు హైరానా పడడం, భారీగా బందోబస్తు ఏర్పాటు చేయడం పరిపాటిగా మారింది. వీరికోసం ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీస్ సిబ్బంది సమయాన్ని, శక్తిని వృధా చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లో సిబిఐ కోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన జగన్ యధావిధిగా తన మార్క్ హంగామాతో వచ్చారు. పదినిముషాల పాటు కోర్టులో హాజరు కావడానికి మందీబార్బలంతో రావడం, ఇతరులకు అసౌకర్యం కలిగించడం, ఆయన గారి కోసం పోలీసులు నానా హడావిడి చేయడం, రక్షణ కోసం అంటూ జనాన్ని రోడ్డుమీది నుంచి తరిమెయ్యడం లాంటివి చూశాం. గరువారం హైదరాబాద్‌లో జగన్ చేసిన హంగామా చూశాక ఇలాంటి నేతలను ఎన్నకుందుకు ప్రజలు సిగ్గుపడాలి. మన ఓట్లతో వీరు ఊరేగడమేంటని ఆలోచన చేయాలి. జగన్ ఎన్నికయ్యాక ఇప్పటి వరకు అసెంబ్లీకి రావడం లేదు. అలాగే ప్రతిపక్షనేత హోదా ఇస్తేనే వస్తానని మొండి కేశారు. ఇక విశాఖ వచ్చినా, గుంటూరుకు వెళ్లినా ఇదే రకంగా హంగామా చేశారు. ఆయన ర్యాలీగా వచ్చే తోవలో ప్రాణాలు పోగ్గొట్టుకుంటే మాకేంది అన్న రీతిలో జగన్ అహంకారంగా సాగుతున్నారు. ఇకపోతే గతంలో కెటిఆర్ కూడా ఒకటి రెండు సందర్భాల్లో ఇలాగే చేశారు. ఇ- కార్ రేసులో విచారణకు వచ్చినప్పుడు, మరో సందర్భంలో ఇలా చేశారు. భారీ కాన్వాయ్‌లతో రావడం, హంగామా చేయడం అవసరమా అన్నది ఆలోచన చేయాలి. కోర్టులు ఆంక్షలు విధిస్తే తప్ప వీరు ర్యాలీలు ఆపేలా లేరు. కనీసం కోర్టుకు విచారణకోసం వచ్చే సందర్భంలో అయినా కోర్టులే ఆంక్షలు విధిస్తే మంచిందని ప్రజలు కోరుకుంటున్నారు. అధికారంలో ఉండగా అడ్డదిడ్డంగా సంపాదించడం, ప్రజలను పురుగుల్లా చూడడం, ఓట్ల కోసం దండాలు పెట్టడం, పీఠమెక్కగానే హంగామాలు చేయడం భారత రాజకీయాల్లో పరిపాటిగా మారింది. ప్రజలే దీనిగురించి ఆలోచించాలి. ఇలాంటి వారిని రాజకీయాలకు దూరం పెట్టాలి. అధికారంలో ఉంటే తమంత గొప్పవారు లేరని భావించడం,అధికారం పోయాక, అధికారంలో ఉన్నవారిని విమర్శించడం ఇప్పుడు కొత్త తరం రాజకీయాలు చూస్తున్నాం. ప్రత్యర్థులను వేధించడమే అధికారం పరమావధి అన్నట్టుగా తెలుగునాట రాజకీయాలను మార్చిన ఘనత కేసీఆర్, జగన్‌రెడ్డిలకు దక్కింది. ఓటుకునోటు కేసులో పట్టుకుని జైలులో వేసిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావడాన్ని కేసీఆర్, కేటీఆర్,హరీష్ రావులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ కారణంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్,హరీష్ రావులు ఒంటికాలి మీద లేస్తున్నారు. అసభ్యంగా వాడు, వీడు అని సంబోధిస్తున్నారు. జగన్ కూడా అప్పుడే ఎపిలో అంతా అయిపోయిందన్న భావనలో మాట్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం దారుణంగా ఉందని రంకెలు వేస్తున్నారు. ఇలాంటి జగన్,కేసీఆర్‌లనే ప్రజలు మట్టికరిపించారని మరచి మాట్లాడుతున్నారు. ఇకపోతే ఏం జరుగుతుందో తెలుసుకోకుండా అటు జగన్, ఇటు కెటిఆర్ అర్జంటుగా గద్దెమీద ఊర్చోవాలన్న తొందరలో ఏదిపడితే అది మాట్లాడేస్తున్నారు. సోషల్ మీడియాలో ఎవరు పడితే వాళ్లు, ఏదిపడితే అది వాగుతున్నారు. తమచేతిలో సోషల్ మీడియా ఉందన్న గర్వంతో ఇష్టానుసారం పోస్టులు పెడుతున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత వీరిద్దరూ సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. బలమైన సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుంటే ఎన్నికల్లో గెలిచిపోవచ్చునని, అలా లేనందునే గత ఎన్నికల్లో ఓడిపోయా మని కేటీఆర్ గతంలో ఓ సందర్భంలో అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు బలమైన సోషల్ మీడియా సైన్యం ఉండి కూడా గత ఎన్నికల్లో ఓటమిని తప్పించుకోలేదు. తాను చేసిందంతా ప్రజల మంచికోసమే అన్న భ్రమలో బటన్ నొక్కుతూ పోయారు. ఇప్పుడేమో ర్యాలీలు, హంగామాలతో మళ్లీ తన ప్రతాపం చాటుతున్నారు. ప్రజల్ని తక్కువ అంచనా వేయడం వల్లే తాము ఓడిపోయామని ఈ రెండు పార్టీల వాళు ఇంకా గుర్తిచడం లేదు. తాము అధికారంలో ఉంటే అంతా సవ్యంగా ఉందని, ఇతరులు అధికారంలో ఉంటే సర్వనాశనం అయిపోతోందని ఎపిలో జగన్, తెలంగాణలో కెటిఆర్ భావిస్తున్నారు. కెసిఆర్ ఉన్నప్పుడే తెలంగాణ బాగుండేదని, ఇప్పుడు ప్రమాదంలో పడిందని కెటిఆర్ నిరంతరంగా ప్రచారం చేయించు కుంటున్నారు. జగన్ అనుయాయులు కూడా ఇదే తరహాలో మీడియా సమావేశాలు పెట్టివాపోతున్నారు. మధ్యలో తెలంగాణ సెంటిమెంట్‌తో బిఆర్ఎస్ నేతలు మళ్లీ తమ రాజకీయ పాచికలు వేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత కూడా కొంత కాలంపాటు ఇదే సెంటిమెంట్‌ను రగిలించి బీఆర్ఎస్ రాజకీయంగా లాభపడింది. అధికారం పోవడంతో ఈ ఇద్దరు నేతలు సొంత మీడియాలో అసత్య కథనాలు, అబద్దాలను ప్రచారం చేసుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎవరేమిటో తెలుసు. అందుకే జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్ బోల్తాపడింది. బిజెపి కూడా అతిగా ఊహించుకుని బొక్కబోర్లా పడింది. ఇవన్నీ ఒక ఎత్తయితే హంగామా రాజకీయాలను రాజకీయ పార్టీల నేతలు మానుకోవాలి. ప్రజలను పరామర్శించ డానికి హంగామా అవసరం లేదు. కోర్టుకు హాజరయినప్పుడు కూడా మందీమార్బలంతో ర్యాలీలు అవసరం లేదు. ఈ విషయాలు అన్ని పార్టీలకు అవసరం. అధికారంలో ఉన్నా, లేకపోయిన పార్టీలు ఈ సూత్రాన్ని పాటించాలి. తమ బలప్రదర్శన కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దు. తమను ఆదరించి అక్కున చేర్చుకున్న వాళ్లే ఎన్నికల్లో ఎందుకు తిరస్కరించారో ఓడిన ప్రతి నాయకుడు తెలుసుకోవాలి. గుణపాఠం నేర్చుకోవాలి. ఓడిపోతే ఎదుటి పార్టీ వారిపై నెపం నెట్టి తప్పించుకోవడం రాజకీయ లక్షణం కాదని గుర్తించాలి. తెలంగాణలో తమకు తిరుగులేదని భావించిన బీఆర్ఎస్‌కు ఈ దుస్థితి ఎందుకు ఏర్పడిందో, ఎపిలో బటన్లు నొక్కినా ఎందుకు ప్రజలు తిరస్కరించారో గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకొంటేనే ఈ రెండు పార్టీలకు మనుగడ ఉంటుంది.అహంకారపూరిత పోకడలను సమాజం హర్షించదని ప్రతి రాజకీయ నేతా గుర్తించాలి.

# నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల పురోగతి,

## ఇతర అంశాలపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమీక్ష

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**




జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పురోగతిపై రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్, రహదారులు, భవనాలు, పంచాయితీ రాజ్, గృహనిర్మాణ, మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులతో వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ గురువారం సమీక్ష నిర్వహించారు.

లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి, సరఫరాలో ఇబ్బందులు దూరం చేసేందుకు వేములవాడ నియోజకవర్గానికి 220/11, 133/11 ఒక్కొకటి 33/11 (11) సబ్ స్టేషన్లు మంజూరు అయ్యాయని, ఆయా సబ్ స్టేషన్ల పురోగతి పై ఆరా తీశారు. రైతు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి 50 ఎకరాల భూమి గుర్తించాలని, తాత్కాలిక భవనం కేటాయించాలని సూచించారు. ఈ భవనాలను సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారని తెలిపారు.

**పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ**

ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద మంజూరైన పనుల నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. 10 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు జరిగిందని, సామాజిక భవనాలు, తదితర వాటికి ఈ నిధులను కేటాయించడం జరిగిందని వివరించారు. 15 కోట్ల పంచాయితీ రాజ్ శాఖ ద్వారా మంజూరు చేయించి, పనుల జాతర కార్యక్రమం చేపట్టడం జరిగింది. పనుల జాతరలో భాగంగా గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, మొదలైన నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన పనుల పురోగతిపై ఆరా తీశారు. బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాల పనులు ప్రారంభం కాకుండా ఉన్న వాటిని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, రహదారి నిర్మించే ప్రదేశాల్లో వేసిన విద్యుత్ స్తంభాలను తొలగించి, రహదారులు నిర్మించాలని ఆదేశించారు. సమస్యలు ఉంటే సంబంధిత శాఖల అధికారులు జాప్యం చేయకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

**రహదారులు, భవనాల శాఖ**

మూలవాగు వంతెనకు 2015 లో శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించకుండా ఉంచారని, ఈ మధ్య తిరిగి శంకుస్థాపన చేసుకున్నామని వివరించారు. వంతెన నిర్మాణం కోసం 6 కోట్ల 90 లక్షల రూపాయలు భూసేకరణ కోసం కేటాయించడం జరిగిందని, అవసరమైన భూసేకరణ చేసి, పనులు ప్రారంభించి, పనులు వేగవంతం చేయాలని, వచ్చే వర్షాకాలంలో లోగా వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న కల్వర్టులు, రహదారుల మరమ్మతు పనులపై ఆరా తీశారు. దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, వంతెనలకు భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మోత్కురావు పేట- చందుర్తి రోడ్డుకు అటవీ శాఖ నుంచి అనుమతి వచ్చిందని, రూ. 24 కోట్లతో రోడ్డు పనులు పూర్తి చేయనున్నామని వివరించారు. మూలవాగు, పెంటి వాగు పై బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

**నీటి పారుదల శాఖ..**

ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 10 చెరువుల పనులు మొదలు కాగా, 7 పూర్తి అయ్యాయని, మర్రిపెల్లి, లచ్చపేట, కలికోట సూరమ్మ ప్రాజెక్టుల పనులు పురోగతిలో ఉన్నాయని ఈఈ తెలిపారు. తక్కువ బడ్జెట్ తో ఎక్కువ ఎకరాల భూమి సాగులోకి తీసుకు వచ్చేందుకు రూ. 325 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, పనులు పూర్తి చేస్తే 45 వేల ఎకరాల భూములకు సాగులోకి వస్తాయని విప్ వెల్లడించారు. జిల్లాలో ఆయా ప్రాజెక్టులు పూర్తి చేస్తే దాదాపు లక్ష 50 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని వివరించారు. మల్కపేట ప్రాజెక్ట్ కోసం కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి మొత్తం 700 ఎకరాల భూమి అవసరమని జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్ తెలిపారు. వాటి కోసం పూర్తి ప్రతిపాదనలు పంపాలని విప్ సూచించారు. వీటిని పూర్తి చేస్తే వేలాది ఎకరాల భూములు సాగులోకి వస్తాయని విప్ తెలిపారు.

**ఇందిరమ్మ ఇండ్లు..**

వేములవాడ నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, 1957 ఇండ్ల నిర్మాణాలకు మార్కింగ్ చేయడం జరిగిందని, 1482 ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని, 12 ఇండ్ల నిర్మాణం ఇప్పటివరకు పూర్తయిందని గృహ నిర్మాణ శాఖ అధికారులు వివరించారు. మండలాల వారీగా ఇండ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ఏమైనా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఉంటే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలని, ఇసుక సమస్యలు ఉంటే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను విప్ ఆదేశించారు.

**వీటీడీఏ ..**

వేములవాడ రాజన్న ఆలయం ద్వారా ప్రతి ఏడాది రూ. 186 కోట్ల ఆదాయం వస్తుందని, అదే స్థాయిలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు గత ఏడాది సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఇదేరోజు నవంబర్ 20వ 2024న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. 150 కోట్ల ఆలయ విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భీమేశ్వర ఆలయంలో రూ. 3.50 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని వెల్లడించారు. రాజన్న ఆలయ వద్ద భక్తులకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

**మిషన్ భగీరథ..**

మిషన్ భగీరథలో భాగంగా త్రాగునీరు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, అగ్రహారంలో ఉన్న మిషన్ భగీరథ గ్రిడ్ ప్లాంట్ నిర్వహణపై ఆరా తీశారు. వాస్తవాలు యంత్రాంగానికి తెలియజేయాలని సూచించారు. 9 మోటార్లు అందుబాటులో ఉన్నాయని, స్టాండ్ బై మోటార్లు కూడా ఉంచాలని, వేసవికాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ముం జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పూర్తి స్థాయిలో మిడ్ మానేరు ప్రాజెక్ట్ నింపడంతో భూములు మునిగి పోతున్నాయో 318 అడుగుల వరకు నీటిని నింపామ్. ప్రాజెక్ట్ కు హద్దులు నిర్ణయించి, అధికారికంగా పూర్తి చేయాలని విప్ పేర్కొన్నారు. రైతులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. మరోసారి సర్వే చేసి స్పష్టం చేయాలని సూచించారు. హద్దులకు రాళ్లు, చెట్లు పెట్టాలని ఆదేశించారు. మధ్య మానేరు నిర్వాసితులకు పట్టాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని, ఆలయాలు, కుల సంఘాల భవనాలకు పరిహారం ఇవ్వాలని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సూచించారు.

వట్టిమల్ల, నిమ్మపల్లి వద్ద ఇసుక రీచ్ లు ఏర్పాటు చేయాలని విప్ కోరారు. రుద్రంగికి 42 కోట్లతో ఏటీసీ మంజూరు అయిందని, నియోజకవర్గానికి 20 వేల మెట్రిక్ టన్నుల గోదాములు మంజూరు అయ్యాయని తెలిపారు. 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ 200 కోట్లతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజాప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభావవంతంగా అమలు చేసి, ప్రజలకు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, సమష్టి విజయం కోసం కృషి చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, తరలింపులో ఇబ్బందులు తొలగించాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు మరింత అంకిత భావంతో పనిచేయాలని పిలుపు ఇచ్చారు.

**పనులను వేగంగా పూర్తి చేయాలి**

నియోజకవర్గంలో ఆయా అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వివిధ అభివృద్ధి పనులకు స్థలాలు వెంటనే గుర్తించాలని సూచించారు. సమన్వయంతో పని చేస్తూ ముందుకు వెళ్లాలని, గడువులోగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బాల్కొండ లో పోలీస్ కళా ప్రదర్శన

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో గురువారం ఎస్సై కే శైలేందర్ ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం పలు అంశాలపై అవగాహనా కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై చిన్నయ్య, మాట్లాడుతూ యువత గంజాయి డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, ఎవరైనా సేవిస్తే, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే పదివేల రూపాయల జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై చిన్నయ్య, హెడ్ కానిస్టేబుల్ వాసుదేవ్, విడిసి అధ్యక్షుడు గుంద్రతి నడిపి పోశెట్టి, మర్కస్ కమిటీ అధ్యక్షుడు ఇఫ్తేకార్, మాజీ సర్పంచ్ తౌట్ గంగాధర్, వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు జెట్టి జనార్ధన్ పాల్గొన్నారు.



# బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిసిఎస్ ఏసిపి నాగేంద్ర చారి అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రామకృష్ణ మఠ్ లో గురువారము జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎస్ కే రసూల్ బి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ పొందే హక్కు, పాల్గొనే హక్కులను పరిరక్షించడానికి అందరూ బాధ్యత వహించాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఎస్కే రసూల్ బి మాట్లాడుతూ పిల్లలు ఎలాంటి వివక్షతలు గురికాకుండా వారి సమగ్ర అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. క్రీడా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో అశ్విని సిడబ్ల్యూసి సభ్యులు రాజేంద్రప్రసాద్, డా.రవికుమార్, జేజే బి మెంబర్ శ్రీలత, డిసిపిఓ చైతన్యకుమార్, దారం గంగాధర్, జిసిడిఓ భాగ్యలక్ష్మి ఇందూరు యువత అసోసియేషన్ అధ్యక్షుడు సాయి బాబు, డిసిపియు చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.



## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు..

### విద్యార్థులకు బహుమతులు అందజేత

సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, నవంబర్ 20.

58వ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా 14 నుండి 19వ తేదీ వరకు నిర్వహించిన విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులు విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమాండ్ అలీ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడానికి, జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలను సందర్శించాలని కోరుకుంటున్నాను. ఈ రోజును పురస్కరించుకుని, పోటీలలో పాల్గొని, విజేతలుగా నిలిచిన వారికి అభినందనలు.ఇట్టి కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డి సోమ భీమిరెడ్డి, నిర్మల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాందేడ్పు చిన్ను, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సమరసింహారెడ్డి, టీఎన్జీవో అధ్యక్షులు ప్రభాకర్, కొంతం గణేష్, పాఠశాల విద్యార్థులు గ్రంథాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ అభిలాష అభినవ్‌కు అభినందనలు తెలిపిన జిల్లా అధికారులు

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో నవంబర్ 20.

ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 18వ తేదీన జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక "జల సంచయ్ %-% జన భాగీదారి" అవార్డును స్వీకరించి గురువారం కలెక్టరేట్ కు వచ్చిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కార్యాలయం ప్రధాన గేటు వద్ద అధికారులు పూలమాలలు, బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. పలువురు అధికారులు కలెక్టర్‌కు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి జల అవార్డుల్లో భాగంగా దక్షిణాది రాష్ట్రాల విభాగంలో నిర్మల్ జిల్లా రెండవ స్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు. జిల్లాకు కోటి రూపాయల రివార్డు లభించడం విశేషమని తెలిపారు. అధికారుల సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పని చేసి, జిల్లాకు మరిన్ని ప్రతిష్టాత్మక అవార్డులు సాధించేందుకు కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. జిల్లాకు ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో పాటు అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## జల సంచయే-జన్ భాగిదారి" అవార్డు అందుకొన్న కలెక్టర్ అభిలాషా అభినవకు ఘన స్వాగతం

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో నవంబర్ 20.

జాతీయ స్థాయిలో మరోసారి నిర్మల్ జిల్లా కీర్తిపతాక ఎగరేసింది. "జల సంచయే-జన్ భాగిదారి" అవార్డును న్యూ ఢిల్లీలో స్వీకరించిన తర్వాత జిల్లా కలెక్టర్ అభిలాషా అభినవ మరియు డీఆర్‌డీవో విజయలక్ష్మికి నిర్మల్‌లో ఘనంగా, ఆత్మీయంగా స్వాగతం పలికారు.విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ అభిలాషాను, నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద అధికారులు, సిబ్బంది మరియు ఉత్సాహభరితులైన ప్రజలు ఆత్మీయ అభినందనలతో స్వాగతించారు. ప్రధాన గేటు నుండి కార్యాలయం వరకు దాదాపు అర కిలోమీటరు దూరాన్ని ఆమెను ప్రజలు హర్షధ్వానాలతో నడకలోనే తీసుకువచ్చారు.అదనపు జిల్లా కలెక్టర్ కిషోర్ కుమార్ మరియు ఇన్‌ఛార్జ్ డీఆర్‌ఓ రత్న కళ్యాణి, జిల్లాలో పర్యావరణ సంరక్షణ మరియు జల నిర్వహణ పట్ల అంకిత భావాన్ని ప్రతిబింబిస్తూ, కలెక్టర్ అభిలాషా మరియు విజయలక్ష్మిని మొక్కలతో సన్మానించారు.కలెక్టర్ కార్యాలయం లోపల జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడిన కలెక్టర్ అభిలాషా, నిర్మల్ జిల్లా సాధించిన ఈ జాతీయ గౌరవం పట్ల గాఢమైన గర్వాన్ని వ్యక్తం చేశారు. ఈ అవార్డు జిల్లా అధికారుల సమష్టి కృషికి, ప్రజల చురుకైన భాగస్వామ్యానికి ప్రతిఫలమని ఆమె పేర్కొన్నారు. "ఈ అవార్డు నిర్మల్‌లోని ప్రతి అధికారి, ప్రతి పౌరుడిదే," అని చెబుతూ అందరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.జాతీయ జల అవార్డుల కింద ప్రదానం చేసే ఈ గౌరవం, ప్రజల భాగస్వామ్యం మరియు సుస్థిర జల సంరక్షణలో విశిష్ట కృషి చేసిన వారిని గుర్తించడమే. ఈ రంగాల్లో నిర్మల్ జిల్లా నిరంతరం ప్రతిభను చాటుకుంటూ వస్తోంది.

ఈ స్వాగత కార్యక్రమానికి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు జిల్లా సాధించిన ఈ విశిష్ట ఘనతను అభినందించారు. అల్-అన్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ, నిర్మల్ కార్యదర్శి మొహమ్మద్ ఇఫ్తిఖారుద్దీన్ అంసారీ కూడా ఉన్నారు.



## బంగారిగూడ లో కార్డెన్ అండ్ సెర్చ్.

### - ఏఆర్ డిఎస్పి కమతం ఇంద్రవర్ధన్

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

ప్రజల సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ అండ్ సెర్చ్) లను నిర్వహించడం జరుగుతుందని ఏఆర్ డిఎస్పి కమతం ఇంద్రవర్ధన్ తెలిపారు. ఉదయం 5 గంటల నుండి 70 మంది సిబ్బందితో గురువారం బంగారి గూడ లో కమ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వహించడం జరిగిందన్నారు. ధ్రువపత్రాలు సరిగా లేనటువంటి 60 ద్విచక్ర వాహనాలు,10 ఆటోలు,2 మ్యాక్స్ స్వాధీనం,అక్రమంగా మద్యం అమ్ముతున్న 3 బెల్ట్ షాపుల జప్తుచేశారు. ఏఆర్ డిఎస్పి ఇంద్రవర్ధన్ ప్రజలతో మాట్లాడుతూ గంజాయి,మదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,ఎలాంటి అసాంఘిక కార్యకలాపాల నిర్వహణ చట్టరీత్యా నేరమని,వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలన్నారు.ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేస్తూ వాటి ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు.మహిళల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ఉండాలని ఎలాంటి గృహహింస చర్యలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు.రాత్రి సమయాలలో అనవసరంగా తిరగరాదని,ఈవ్ టీజింగ్ మరియు మహిళలను వేధించడం లాంటివి నిర్వహించకూడదని,గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సోషల్ మీడియా పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐ లు కె ఫణిదర్,కె నాగరాజు,రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు టీ మురళి,ఎన్ చంద్రశేఖర్,రూరల్ ఎస్సై వి విష్ణువర్ధన్,ఎస్ఐలు డి రాధిక,జీవన్ రెడ్డి,రాకేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

### ఎస్ఈసీ ఐ.రాణి కుముదిని

### కలెక్టర్లతో వీసీ సమావేశం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే హాజరయ్యారు.గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, శాంతిభద్రతల అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీపీఓ శర్ఫుద్దీన్, డిప్యూటీ జడ్పీ సీఈవో గీత పాల్గొన్నారు.



## ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

డిసెంబర్ 1వ తేదీన పటాన్చెరు పట్టణంలో నిర్వహించ తలపెట్టిన వందేమాతరం 150 వసంతాల సామూహిక గీతాలాపన కార్యక్రమ ఏర్పాట్లను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు గురువారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలిసి పటాన్చెరు పట్టణంలోని నొవపాన్ పరిశ్రమ సమీపంలో గల ఖాళీ స్థలంలో కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు తెలిపారు 30 వేల మంది విద్యార్థులు ఒకే సమయాన సామూహిక గీతాలాపన చేసేలా కార్యక్రమాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్ సిఐ వినాయక్ రెడ్డి జాతీయ రహదారుల సంస్థ డి ఈ రామకృష్ణ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ మండల విద్యా శాఖ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



## బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో గురువారము మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ల బాల్రెడ్డి ఆధ్వర్యంలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు, నాయకులు శ్రీల ప్రశాంత్, ఉచ్చిడి బాల్రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాకతీయ నగర్ కాలనీ పార్క్ పనులు వేగవంతం

### కార్పొరేటర్ పుష్పానగేష్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

కాకతీయ నగర్ కాలనీ లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ అన్నారు త్వరలో మంత్రులు ఎమ్మెల్యే లచే డివిజన్ లో అభివృద్ధి పనులు ప్రారంభించాల్సి ఉన్నందున అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతాం అని నిన్నటి రోజున సమీక్షా సమావేశం నిర్వహించిన జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు రామచంద్రపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేష్ గురువారం రామచంద్రాపురం డివిజన్ కాకతీయ నగర్ కాలనీ లో బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు అందులో భాగంగా జిహెచ్ఎంసి ఏఎంవోహెచ్ విజయమోహన్ ఎస్ఎస్ కేశవులతో కలిసి కాలనీ లోరోడ్లపై చెత్త పడేస్తున్న సమస్యను గుర్తించారు కార్పొరేటర్ ముఖ్యంగా కాలనీ లో నూతనంగా 3.20 కోట్ల హెచ్ఎండిఏ నిధుల నుంచి నిర్మిస్తున్న పార్క్ పక్కన ట్రాన్స్ఫార్మర్ వద్ద ఓపెన్ గార్బేజ్ పాయింట్ అయ్యిందని గుర్తించారు అంత పెద్ద ఎత్తున్న నిర్మిస్తున్న పార్క్ పక్కన ఇలా ఉంటే ఎలా అని అధికారులను అడిగిన కార్పొరేటర్ దంపతులు వెంటనే గార్బేజ్ పాయింట్ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు కార్పొరేటర్ అనంతరం హెచ్ఎండీఏ ఇంజనీరింగ్ డిఈ రంజిత్ ఎలక్ట్రికల్ డిఈ సౌమ్య ఫారెస్ట్ ఆఫీసర్ ప్రణీత మరియు కాలనీ అధ్యక్షులు అమృత్ సాగర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి నరేంద్రబాబు తో కలిసి 3.20 కోట్లతో నిర్మిస్తున్న థీమ్ పార్క్ పనులను పరిశీలించారు వాకింగ్ ట్రాక్ లో డిజైన్ గేట్ ఎంట్రన్స్ అర్చ్ గజేబో డిజైన్ పై చర్చించి నిర్ణయం తీసుకున్నారు వచ్చే నెలలోపల పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కార్పొరేటర్ దంపతులు తెలిపారు త్వరలోనే మంత్రులు మేయర్ ఏంఎల్ఏ ల ద్వారా పనులు ప్రారంభిస్తామని తెలిపారు వారితో శ్రీనివాసులు గోల రాములు వెంకట్ రావు ధనసిరి ప్రకాష్ ఎన్ఎస్ రెడ్డి మునీందర్ అంజద్ వీర్శెట్టి గోవర్ధన్ రెడ్డి బ్రహ్మ రాజు తదితరులు పాల్గొన్నారు



## చిన్నారుల గుండె వ్యాధులకు నిమ్స్ ఆస్పత్రిలో అవసరమైన అన్ని వైద్య సేవలు.

### - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా రిమ్స్ నుంచే అన్ని అవసరమైన వైద్య సేవలు అందించేలా సమర్థమైన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో అపోలో,ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్నారుల ఉచిత గుండె జబ్బుల వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు.రిమ్స్‌లోని డీఈఐసి కేంద్రంలో హైదరాబాద్ అపోలో కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పీడియాట్రిక్ కార్డియాలజీ శిబిరానికి ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 150 మంది చిన్నారులు హాజరయ్యారు.వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించి,అవసరమైన వారికి శస్త్రచికిత్సల నిమిత్తం హైదరాబాద్‌కు రావాలని సూచించారు.ఒక చిన్నారి తల్లి హైదరాబాద్‌లో పరీక్షలు చేయించుకుంటున్నట్లు తెలుసుకున్న కలెక్టర్,రిమ్స్‌లోనే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని,వాటిని ఇక్కడే వినియోగించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించేలా రిమ్స్‌లోనే వైద్య చికిత్సలు అందించాలని అన్నారు.వైద్య పరీక్షలు,మందులు,స్కానింగ్,2డీ ఈకో వంటి సేవలు రిమ్స్‌లోనే అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.పేదలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించేందుకు అపోలో ఆసుపత్రి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.మందులు,స్కానింగ్ తదితర పరీక్షల కోసం పేదలపై భారం తగ్గేలా ప్రణాళికలు రూపొందించి,రవాణా ఖర్చులు మాత్రమే అయ్యే విధంగా హైదరాబాద్‌కు పంపేలా వ్యవస్థను రూపొందించాలని రిమ్స్ డైరెక్టర్‌కు సూచించారు.అవసరమైతే ఆసుపత్రి యాజమాన్యానికి లేఖ రాసి, రిమ్స్‌లోనే పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్,డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్,వైద్యులు వై.సి.శ్రీనివాస్,సమీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# బల్దియా పరిధిలో ప్రతి వీధి దీపం వెలగాల్సిందే

## ఎమ్మెల్యే జిఎంఆర్ అదేశాలు

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

జిహెచ్ఎంసి పరిధిలోని పటాన్చెరు రామచంద్రాపురం భారతి నగర్ డివిజన్ల పరిధిలో గల ప్రతి వీధి దీపం వెలగాల్సిందేనని క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు గురువారం సాయంత్రం పటాన్చెరులోని క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి విద్యుత్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ బల్దియా పరిధిలోని మూడు డివిజన్ల పరిధిలో విద్యుత్ స్తంభాలు లైట్ల పనితీరుపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సమీక్షించాలని కాలనీలలో వీధి దీపాలు వెలగకపోవడం మూలంగా అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోతాయని అన్నారు శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాలను బిగించాలని ఆదేశించారు వీధి దీపాల అంశంలో ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకొని రావాలని సూచించారు ఈ సమావేశంలో విద్యుత్ విభాగం డిఈ లక్ష్మీ ప్రియ ఏఈ లికిత తదితరులు పాల్గొన్నారు



# అంగన్వాడి సిబ్బందిని నియమించాలి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్

ఉట్నూర్ మండలం పులిమడుగు, ఆంధోలి గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో అంగన్వాడి సిబ్బందిని నియమించాలని, ఆంధోలిలో అంగన్వాడి సొంత భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారము ఉట్నూర్ ఐటిడిఏ కార్యాలయంలో పిఓ యువరాజ్ మర్మాట్ కు బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై ఆయన సుముఖత వ్యక్తం చేశారు.



# మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఏఫ్ఎస్ఓలు

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా ఏడపల్లి మండలం జానకంపేట జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో గురువారం ఆహార భద్రత అధికారులు టి సునీత, జి నవీత, మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ముడి సరుకుల బిల్లులు భద్రపరిచి ఉంచాలని వంట నిర్వాహకులకు సూచించారు.



# సీనియర్ సిటిజన్లకు గౌరవం లభిస్తేనే సమాజంలో మరింత అభివృద్ధి.- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

సీనియర్ సిటిజన్లకు సముచిత గౌరవం లభించినప్పుడే సమాజం మరింత ప్రగతి సాధిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.వయోవృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వం సీనియర్ సిటిజన్ యాక్ట్ ను తీసుకురావడం జరిగిందని,ఈ చట్టంపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వయోవృద్ధులు తమ పూర్తి ఆస్తిని పిల్లలకు ఇవ్వకుండా కొంత భాగాన్ని తమ భద్రత కోసం ఉంచుకోవాలని సూచించారు.పిల్లలు సంరక్షణ చేయని పక్షంలో కలెక్టర్ లేదా ఆర్డీఓకు దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి తిరిగి ఆస్తిని పొందే అవకాశం ఉంటుందన్నారు.జిల్లా అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలలో వయోవృద్ధులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. దస్నాపూర్‌లో వయోవృద్ధుల కోసం ప్రత్యేక భవనం నిర్మించి ఇంచార్జి మంత్రిచే ప్రారంభించుకున్నామని,అక్కడ డే కేర్ కేంద్రం కూడా త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా వయోవృద్ధుల సంరక్షణ టోల్ ఫ్రీ నంబర్ పోస్టర్‌ను ఆవిష్కరించి,పలువురు వయోవృద్ధులను మెమెంటోలతో సన్మానించారు.ఇందులో భాగంగా విశ్రాంత హిందీ పండితులు కోరెడ్డి శివన్న గారిని జిల్లా కలెక్టర్ సన్మానించారు.అంతకుముందు ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించి వైద్యులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి మిల్కా,వయోవృద్ధుల సమైక్య సభ్యులు దేవిదాస్,లక్ష్మారెడ్డి,కోరెడ్డి శివన్న విశ్రాంత హిందీ పండితులు, అధికారులు, వైద్యులు,వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల ధన,మాన,ప్రాణ భద్రత పోలీసుల బాధ్యత. - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

ప్రజల రక్షణకై,భద్రతకి జిల్లా పోలీసులు అప్రమత్తతో ఉంటూ విధుల నిర్వహణ చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.గురువారం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ,గత మూడు వారాలుగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ కార్యాలయాల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న డయల్ హండ్రెడ్ (100) సిబ్బంది,గ్రామాలను సందర్శిస్తూ ప్రజలలో చైతన్యపరిచే కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లాలోని మొత్తం 19 మండలాలలోని డయల్ 100 పోలీసు సిబ్బంది గ్రామాలు మరియు పట్టణంలోని వార్డులలో సందర్శిస్తూ పోలీసు మీకోసం కార్యక్రమాలు నిర్వహిస్తూ,ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలపై మరియు ప్రజలు చేస్తున్న పొరపాట్లపై, వాటి వల్ల కలుగు అనార్థాలపై,సవివరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.అందులో ముఖ్యంగా సైబర్ క్రైమ్ ద్వారా నవీన పద్ధతుల్లో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్న విధానాలను వివరించడం జరుగుతుందన్నారు.రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి రోడ్ సేఫ్టీ క్లబ్ పేరుతో జిల్లాలో మొట్టమొదటిసారిగా ప్రారంభించబడిన కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.మహిళల పట్ల జరుగు నేరాలపై,చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని,ముఖ్యంగా బాల్య వివాహాలు జరగకుండా ప్రజలలో చైతన్య పరచడం జరుగుతుందని తెలిపారు.మహిళలు,చిన్నారుల పట్ల జరుగు నేరాలు,పోక్సో చట్టం పై ప్రజలకు అవగాహన కల్పించి,గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ లపై సవివరంగా వివరిస్తున్నట్టు తెలిపారు.ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న సందర్భంలో ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని,ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించి వాహనం నడపాలని సూచించారు.మద్యం మత్తులో వాహనాలు నడపకుండా ఇతరులకు ప్రమాదాలు జరగకుండా తాము ప్రమాదాలకు గురి కాకుండా ఉండాలని తెలిపారు. గంజాయి,మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,గంజాయి యువత దేశ భవిష్యత్తును నాశనం చేస్తుందని విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు.జిల్లా పోలీసులు 24 గంటలు ప్రజల ధన,మాన,ప్రాణ రక్షణకై విధులను నిర్వర్తిస్తుంటారని,ఏ సందర్భంలోనైనా ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా డయల్ 100 ద్వారా జిల్లా పోలీసుల సహాయాన్ని పొందవచ్చని తెలిపారు.జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగిన సమాచారం మీకున్న,మెసేజ్ యువర్ ఎస్పి అనే కార్యక్రమం ద్వారా ప్రారంభించబడిన 8712659973 నెంబర్ కు వాట్సాప్ ద్వారా సమాచారాన్ని అందించాలని,సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.సుదూర ప్రాంత ప్రజలు తమ సమస్యలను తమ ప్రాంతంలో జరిగే అసాంఘిక కార్యకలాపాల పట్ల సమాచారాన్ని అందించవచ్చని తెలిపారు.




# జిల్లా కలెక్టర్ కు యువజన కాంగ్రెస్ నాయకుల సన్మానం

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

జిల్లాలో జల సంరక్షణకు చేసిన కృషిగాను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా జాతీయ పురస్కారాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు.ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ ను శాలువాతో సత్కరించారు.మిఠాయిలను అందజేసి అభినందనలు తెలిపారు.ఈ అవార్డుతో జాతీయస్థాయిలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకు వచ్చారని జిల్లాకు ఎంతో గర్వకారణమని కలెక్టర్ కృషిని కొనియాడారు.భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బేల మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్,యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు,మల్లారెడ్డి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ ను సత్కరించిన జర్నలిస్టులు

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఇటీవల జాతీయ స్థాయి పురస్కారం అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను జర్నలిస్టులు సత్కరించారు.గురువారం ఆదిలాబాద్ కలెక్టర్ ను కలిసి,జర్నలిస్టులు శాలువా కప్పి మెమొంటోతో సత్కరించారు.జిల్లాకు జాతీయస్థాయి అవార్డులు రావడం జిల్లా అభివృద్ధికి మరింత దోహద పడుతుందని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పలువురు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.



# జాతీయ రహదారిని పునరుద్ధరించాలి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ నుండి ముప్కాల్ వరకు(పాత ఎన్ హెచ్ 7 రోడ్)గల రహదారికి మరమ్మత్తు చేపట్టాలని, కొత్త రోడ్లు మంజూరు చేయాలని కోరుతూ బాల్కొండ ఆర్ అండ్ బి కార్యాలయంలో గురువారము స్థానిక యువకులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యువకులు తోట నవీన్,అనికేష్ పవన్, మల్లెపూల శివప్రసాద్ గౌడ్, కొత్తింటి రాకేష్, సళ్ళగారిగే రాఘవ పాల్గొన్నారు.

# కెటిఆర్‌పై అక్రమ కేసులు రేవంత్ లక్ష్యం

## రాజకీయ కక్షసాధింపునకు పరాకాష్ట

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శ

హైదరాబాద్,నవంబర్20(సమయజ్యోతి):



హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికమన్నారు. కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ అని ఆయన విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రతిపక్ష నేతలను వేధించడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారు. స్థానిక ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసం చిల్లర డ్రామాలు చేస్తున్నారు. కేటీఆర్‌కు అండగా ఉంటాం అని హరీశ్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. అక్రమ కేసులతో కేటీఆర్, బీఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయకక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట ఇది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేస్తుండటం దుర్మార్గం. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్‌లో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నది కాంగ్రెస్ సర్కార్. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్ పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికం.స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారు. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది. రేవంత్ రెడ్డి దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటాం.' అని ట్వీట్ చేశారు.

# సోషల్ మీడియా చర్చలో ఎగ్‌ఫ్రీజింగ్

## ముందే దాచుకున్న అండాలతో ఎప్పుడైన గర్భం

## ఉపాసనా కామినేని పోస్ట్‌తో ఇప్పుడు సర్వత్రా ఆసక్తి

హైదరాబాద్,నవంబర్20(సమయజ్యోతి):

టాలీవుడ్ నటుడు రామ్ చరణ్ భార్య ఉపాసన కామినేని కొణిదల. ఇటీవల ఐఐటీ హైదరాబాద్ ఈవెంట్‌లో ఎగ్ ఫ్రీజింగ్‌పై చేసిన వ్యాఖ్యలు వివాదం సృష్టించాయి. అలాగే ఇప్పుడు ఎగ్ ఫ్రీజ్‌పై చర్చలు మొదలయ్యాయి. దీనిపై సర్వత్రా ఆసక్తి కూడా కనిపిస్తోంది. ఇదో రకంగా మంచిదే. కొత్త అంశాలను నవదంపతులు తెలుసుకునే అవకాశం రావడంతో సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ఇక వివరాల్లోకి వెళితే...ఈ వివాదం నేపథ్యంలో ఉపాసన మళ్లీ స్పందించారు. ఎక్స్ అకౌంట్‌లో తన వ్యాఖ్యలను సమర్థిస్తూ ఓ పోస్టు చేశారు. కెరీర్‌పై దృష్టి పెట్టే మహిళలు.. తమ ఎగ్స్‌ను ఫ్రీజ్ చేసుకోవాలని, ఆ తర్వాత తమకు నచ్చిన సమయంలో గర్భాన్ని దాల్చాలని ఉపాసన సలహా ఇచ్చారు. ఆ సలహాపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. డాక్టర్లు, ఇన్‌ఫ్లూయన్సెర్లు, సోషల్ మీడియా యూజర్లు ఉపాసన వ్యాఖ్యలను తొలుత తప్పుపట్టారు. ఆ వ్యాఖ్యల పట్ల స్పష్టత కావాలని కొందరు ఆన్‌లైన్‌లో ఆమెను అడిగారు. ఈ నేపథ్యంలో ఉపాసన మళ్లీ ఎగ్ ఫ్రీజింగ్ గురించి స్పందించారు. అండాల సంరక్షణపై ఆరోగ్యకరమైన చర్చ జరుగుతున్నట్లు ఆమె చెప్పారు. తన వ్యాఖ్యలు ప్రజల్లో చర్చకు దారితీయడం సంతోషకరమని అన్నారు. ప్రజల స్పందన గౌరవిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎగ్ ఫ్రీజింగ్ వల్ల కలిగే లాభనష్టాల గురించి ఆమె వెల్లడించారు. తన వ్యక్తిగత అనుభవాలను ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. పెళ్లి, ఫలదీకరణ గురించి ఆమె తన పోస్టులో రాశారు. తనకు 27 ఏళ్ల వయసులో పెళ్లి జరిగిందని, తన ఇష్టపూర్వకంగా జరిగిందని, 29 ఏళ్ల వయసులో వ్యక్తిగత, ఆరోగ్య కారణాల దృష్ట్యా తన అండాలను ఫ్రీజ్ చేయాలని నిర్ణయించుకున్నానని, 36 ఏళ్ల వయసులో తనకు తొలి సంతానం కలిగిందని, 39 ఏళ్ల వయసులో కవల పిల్లలకు జన్మనివ్వనున్నట్లు ఉపాసన తన పోస్టులో తెలిపారు. పెళ్లి, కెరీర్ మధ్య పోటీ సహజమే అని, కానీ నిండు జీవితంలో అవి రెండు ముఖ్యమే అని, అయితే నేను ఆ రెండింటికి టైం ఫిక్స్ చేసుకున్నానని, తన హక్కును తాను వినియోగించుకున్నట్లు ఉపాసన పేర్కొన్నారు. మర్యాద పూర్వకంగా స్పందిస్తున్న తన ఫాలోవర్లకు ఉపాసన థ్యాంక్స్ చెప్పింది. ఉద్యోగ సంస్థలు మహిళలకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలన్న అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేసింది. ఐఐటీ హైదరాబాద్‌లో జరిగిన కెరీర్ కౌన్సిలింగ్‌లో మాట్లాడుతూ.. మహిళలకు అతిపెద్ద బీమా తమ అండాలను ఫ్రీజ్ చేసుకోవడమే అని ఆమె అన్నారు. ఎందుకంటే ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి, ఎప్పుడు పిల్లలను కనాలన్న అంశాలపై నిర్ణయం తీసుకోవడం సులువు అవుతుందన్నారు. ఆర్థికంగా బలోపేతం అయిన తర్వాత ఆ నిర్ణయాలను అమలు చేయవచ్చు అని ఆమె అన్నారు. ఎంత మంది పెళ్లి చేసుకోవాలని విద్యార్థులను ఉపాసన ప్రశ్న అడిగిన సమయంలో.. అమ్మాయిల కన్నా అబ్బాయిలే ఎక్కువ మంది చేతులు లేపారు. దీనిపై ఉపాసన స్పందిస్తూ.. ఇది ప్రగతిశీల భారత్‌కు నిదర్శనమన్నారు. ఉపాసన చేసిన ఆ సూచన వల్ల ఆన్‌లైన్‌లో విమర్శలు వెల్లువెత్తాయి. తన సలహా జీవసంబంధమైన పరిమితులకు భిన్నంగా ఉన్నట్లు కొందరు విమర్శకులు పేర్కొన్నారు. ఫెర్టిలిటీ చికిత్స సులువైన అంశం కాదన్నారు. ఐవీఎఫ్, ఎగ్ ఫ్రీజింగ్ వల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఓ ప్రముఖ గైనకాలజిస్ట్ స్పందిస్తూ .. బ్యాంకుల్లో కోట్లు ఉన్నవాళ్లు ఎగ్ ఫ్రీజింగ్ గురించి సలహా ఇవ్వడం సులువే అన్నారు. ఐవీఎఫ్ చికిత్సకు లక్షలు ఖర్చు అవుతోందన్నారు. ఎగ్ ఫ్రీజింగ్ కోసం ప్రతి ఏడాది లక్షల్లో ఖర్చు అవుతుందన్నారు. ఒక్క సిట్టింగ్ కూడా ఖర్చు చేయలేని మహిళలు ఉన్నట్లు తెలిపారు. ఒకవేళ అండాలను ఫ్రీజ్ చేసినా.. అవి చివరకు విజయవంతంగా గర్భం దాల్చేం అవకాశం ఉంటుందో లేదో చెప్పలేమని మరో గైనిక్ డాక్టర్ అన్నారు.



# బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బిగ్ షాక్

## ఫార్ములా -కారు రేసు కేసు విచారణకు గవర్నర్ అనుమతి



హైదరాబాద్,నవంబర్20(సమయజ్యోతి):

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా -కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేం దుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జీషీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1 గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు. గవర్నర్ అనుమతి నేపథ్యంలో, చార్జ్‌షీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జ్‌షీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ( ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా- ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్ట్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం తెలంగాణ పురపాలక శాఖ తరుపున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది. రేసు నిర్వహణ ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ భరించింది.

# ఆపరేషన్ సంభవ్ సక్సెస్

## ఇది ఇకముందూ కొనసాగుతుంది

## రంపచోడవరంలో ఎన్‌కౌంటర్ ప్రాంతంలో పర్యటన

## స్వాధీనం చేసుకున్న ఆయుధాలను

## పరిశీలించిన డిజిపి

రంపచోడవరం,నవంబర్ 20(సమయజ్యోతి):

ఏపీలో ఆపరేషన్ సంభవ్ సక్సెస్ అయ్యిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. గురువారం ప్రత్యేక హెలికాప్టర్‌లో రంపచోడవరం చేరుకున్న డీజీపీ.. ఏవోబీ ప్రాంతంలో ఏరియల్ సర్వే చేశారు. ఆపై జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన రెండు వరుస ఎన్ కౌంటర్లలో మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించారు. ఎకే 47 గన్స్, రైఫిల్, పేలుడుకు ఉపయోగించిన వస్తువులను పరిశీలించారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్ కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు. 50 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశామన్నారు. ఈ ఏడాది జూన్‌లో రంపచోడవరంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో లొంగిపోవాలని మావోయిస్టులను హెచ్చరించామని తెలిపారు. మావోయిస్టులు లేని ఏపీగా చేయాలనుకున్నామని వెల్లడించారు. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుందని డీజీపీ హరీష్ గుప్తా స్పష్టం చేశారు. ఃూగా.. రెండు రోజుల క్రితం అల్లూరు సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో అగ్రనేతలు నేలరాలిన విషయం తెలిసిందే. మొదటి ఎన్‌కౌంటర్‌లో మావో అగ్రనేత హిడ్మా, ఆయన సతీమణితో పాటు.. నలుగురు మావోయిస్టులు మరణించారు. రెండో రోజు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడు మంది మావోలు హతమయ్యారు. వీరిలో కీలక నేతలు కూడా ఉన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో లభించిన డైరీ ఆధారంగా ఏపీలోని పలు జిల్లాల్లో పోలీసులు, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 50 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వారికి వైద్య పరీక్షల అనంతరం ఆయా జిల్లాల కోర్టులో హాజరుపర్చగా.. కోర్టు వారికి రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.

# దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ



## కేంద్రమంత్రికి సిఎం రేవంత్ సూచన

## పరిశీలిస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి

హైదరాబాద్,నవంబర్20(సమయజ్యోతి):

దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల్లో వినియోగదారులకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గురువారం ఉదయం హోటల్ తాజ్‌కృష్ణలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తినే బియ్యాన్ని సరఫరా చేస్తేనే సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలాగే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రి కోరారు. అవసరమైతే అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకోవాలని వినతి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత పరిశీలించి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

## వ్యక్తిగత హాజరు తో పూర్తయిన లాంఛనం

## జగన్ రాకతో అభిమానుల హల్‌చల్

హైదరాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి):

అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు వైకాపా నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుం చి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు జగన్ సీబీఐ కోర్టుకు హాజరుకానున్న నేపథ్యంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద వైకాపా కార్యకర్తలు హల్‌చల్ చేశారు. కొందరు రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. ఎయిర్ పోర్టు లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారితో వాగ్వాదానికి దిగారు. మరోవైపు సీబీఐ కోర్టు వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

# కెటిఆర్‌పై రాజకీయ కక్షసాధింపు

## స్థానిక ఎన్నికల ముందు ప్రభుత్వం కుట్ర

## మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు వేముల, వినోద్

హైదరాబాద్,నవంబర్20(సమయజ్యోతి):



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీని కట్టడి చేయడానికి బీజేపీ, కాంగ్రెస్ కలిసి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఎలాంటి అవినీతి జరగని ఫార్ములా ఈ కార్ రేస్‌లో విచారణకు ఏసీబీ అనుమతి ఇస్తూ గవర్నర్ అనుమతి తెలపడంతో కాంగ్రెస్, బీజేపీలు కలిసి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయనేది తేటతెల్లామైంది. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చినపుడు, ఎన్నికలు వచ్చినపుడు ఇలాంటి కేసుల అంశాన్ని తెరపైకి తెచ్చి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడు అని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. రెండేండ్లుగా ఫార్ములా ఈ రేస్‌పై విచారణ పేరుతా కొండను తవ్వి ఎలుకను పట్టలేకపోయారు. ఇప్పుడు మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్షపూరిత రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపింది. అందులో భాగంగానే విచారణ పేరిట కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడు. ఫార్ములా ఈ కార్ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిందు కేటీఆర్. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకులను కట్టడి చేయగలం అనుకోవడం పొరపాటే. మీరెన్ని అక్రమ కేసులు పెట్టిన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకు, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటాం. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. న్యాయస్థానాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది.. మీరు చేసే కుట్రలను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం అని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలు సరికాదు అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. సమాజంలో ప్రజల అంశాలపై ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేయడం రాజ్యాంగ విరుద్ధం అని మండిపడ్డారు. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్‌లో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నది కాంగ్రెస్ సర్కార్ అని విమర్శించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి అని వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికం. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. సీఎం రేవంత్ రెడ్డి కుట్రలను న్యాయపరంగా ఎదుర్కొంటాం అని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేపై విచారణ

## పోచారం, అరికెపూడిలతో ముగింపు

## దానం, కడియంలకు మరోమారు నోటీసులు

హైదరాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి):

సుప్రీం మరో నాలుగు వారాల గడువు ఇవ్వడంతో పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కుంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. గురువారం పోచారం శ్రీనివాసరెడ్డి, అరికెపూడి గాంధీలను విచారించారు. పదిమందిలో ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటి వరకు అఫిడవిట్‌లు దాఖలు చేయని పరిస్థితి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి.. స్పీకర్ నోటీసులకు స్పందించని విషయం తెలిసిందే. దీంతో వారిరువురికి స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేశారు. అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేశారు. ఇక.. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కుంటున్న ఎమ్మెల్యేల విచారణ గురువారంతో ముగిసింది. కేసు విచారణ ఆలస్యంపై సుప్రీం సీరియస్ అవడంతో పాటు నాలుగు వారాలు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణలో వేగం పెంచాలని అసెంబ్లీ స్పీకర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండో విడత విచారణలో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలను విచారణకు పిలిచారు. ఉదయం ఎమ్మెల్యేల విచారణ మొదలైంది. పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ జగదీశ్ రెడ్డి కేసును స్పీకర్ విచారించారు. ఇరు వర్గాల వాదనలను స్పీకర్ విన్నారు. అలాగే మధ్యాహ్నం అరికెపూడి గాంధీ వర్సెస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కేసు విచారించారు. వీరి విచారణతో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి అవుతుంది. మరోవైపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ పెద్దలను కలవనున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ ముగియనున్నప్పటికీ ఇప్పటి వరకు దానం అఫిడవిట్లు దాఖలు చేయలేదు. విచారణకు హాజరైతే వేటు పడుతుందని దానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేటు పడితే ఆరు సంవత్సరాల పాటు పోటీ చేయడానికి నో ఛాన్స్. ఈ క్రమంలో రాజీనామా చేసేందుకు దానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. రాజీనామా చేస్తే తన పరిస్థితి ఏంటని పార్టీ పెద్దలతో దానం సంప్రదింపులు జరుపనున్నట్లు తెలుస్తోంది.

# భార్యాపిల్లల హత్య కేసు

## నిందితుడికి ఉరిశిక్ష ఖరారు-వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు

వికారాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి):

భార్య, పిల్లల్ని దారుణంగా హత్య చేసిన కేసులో వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి ఉరిశిక్ష ఖరారు చేసింది. వికారాబాద్ జిల్లాలో 2019లో ప్రవీణ్ అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లల్ని చంపేశాడు. అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించాడు. అయితే, ఈ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జిల్లా కోర్టు అతడికి ఉరిశిక్ష విధించింది. ఈ మేరకు కేసును విచారించిన వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. భార్య, పిల్లలను చంపిన కేసులో నిందితుడికి కోర్టు ఉరి శిక్ష ఖరారు చేసింది. 2019లో భార్య, ఇద్దరు పిల్లలను ప్రవీణ్ అనే వ్యక్తి చంపాడు. భార్య, పిల్లల హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించాడు. ప్రవీణెళి భార్య, పిల్లలను చంపాడని రుజువు కావడంతో కోర్టు ఉరిశిక్ష విధించింది. పోలీసుల సమాచారం ప్రకారం.. ప్రవీణ్ కుమార్(32) వృత్తిరీత్యా ప్రయివేటు ఉద్యోగి. వికారాబాద్‌లో భార్యాపిల్లలతో కలిసి నివాసం ఉండేవాడు. భార్య చాందినీకి వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఆమెను ఇనుపరాడ్‌తో కొట్టి చంపాడు. ఐదేండ్ల కుమార్తె ఇన్షిల్‌ను, తొమ్మిదేళ్ల కుమారుడు అయాన్ కూడా హతమార్చాడు. అయితే చాందిని ప్రవీణ్‌కు రెండో భార్య. కాగా కుమారుడు అయాన్ చాందినికి మొదటి భర్త సంతానం. ఇన్షిల్ మాత్రం ప్రవీణ్ కూతురే. ఇక భార్య చాందిని మొబైల్‌లో సందేశాలు చూసి ప్రవీణ్ తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యాడు. తరుచూ మద్యం సేవించి భార్యతో గొడవపడేవాడని దర్యాప్తులో బయటపడింది. ఈ క్రమంలోనే భార్యాపిల్లలను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే వారిని హత్య చేసిన అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పటికీ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించారు. నేరం తీవ్రత, ఆధారాలను పరిశీలించిన వికారాబాద్ కోర్టు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది

# సిగాచి మృతుల కుటుంబాలకు ధోకా

## - వారికి ఇస్తాన్న కోటి పరిహారం ఏమైంది

## -డెత్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వకుండా కాలయాపన

## తక్షణం ఆదుకోవాలంటూ సిఎంకు హరీష్ రావు లేఖ

హైదరాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి):

సిగాచి బాధితులకు ఇస్తామన్న కోటి పరిహారం హామీ ఏమైందని ప్రశ్నిస్తూ సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. నాలుగు నెలలు గడిచినా సిగాచి బాధితులకు పరిహారం అందక పోవడంతో.. ప్రభుత్వ నిర్లక్ష్యంపై హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఇచ్చింది 26 లక్షలే.. ప్రభుత్వం బాకీ పడింది 74 లక్షలు.. ఇది ముఖ్యమంత్రి మాట తప్పడం కాదా? అని హరీశ్ రావు నిలదీశారు. కార్మికులకు రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ డబ్బులను కూడా ప్రభుత్వం ఇప్పించే నష్టపరిహారంలో చూపించడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గారు నిస్సిగ్గుగా బాధితులకు రూ. 40 నుండి 50 లక్షలు అందించాం అని ప్రకటించడం అత్యంత శోచనీయం అన్నారు.. చికిత్స ఖర్చులను పరిహారంలో కోత విధించడం అమానవీయం. ఆచూకీ దొరకని 8 మందికి డెత్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం దుర్మార్గం. సిగాచి యాజమాన్యానికి అధికారులు ఏజెంట్లుగా మారారు. బాధితులను చీదరించుకోవడం దారుణం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేంద్రం ప్రకటించిన రూ. 2 లక్షలు ఇప్పించే సోయి రాష్ట్ర ప్రభుత్వానికి లేదా? హైకోర్టు మొట్టికాయలు వేసినా యాజమాన్యాన్ని ఎందుకు అరెస్టు చేయడం లేదు? తక్షణమే కోటి పరిహారం చెల్లించాలి.. లేదంటే బీఆర్ఎస్ పక్షాన ఉద్యమిస్తాం అని హరీశ్ రావు హెచ్చరించారు. పరిహారం కోసం బాధితుల చెప్పులు అరిగేలా తిరుగుతున్నా.. పాలకుల మనసు కరగడం లేదు. సిట్ వేయరు.. అరెస్టులు చేయరు.. నిస్సిగ్గుగా సిగాచి యాజమాన్యాన్ని కాపాడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వారికి న్యాయం చేయాలని కోరారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని 'సిగాచి' పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగి, నాలుగు నెలలు గడిచింది. 54 మంది కార్మికులను పొట్టనపెట్టుకున్న నాటి దుర్ఘటన ఇంకా కళ్లముందే కదలాడుతున్నది. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబ సభ్యులు నడి రోడ్డున పడి కన్నీరు మున్నీరవుతున్నాయి. సిగాచి ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో మీరు, మీ ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. ప్రమాదం జరిగిన జూన్ 30న మీరు స్వయంగా వచ్చి, మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందిస్తామని ఘనంగా ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని మీడియా సాక్షిగా హామీ ఇచ్చారు. కానీ నిజానికి ఏం జరిగింది? పరిహారాన్ని పరిహాసంగా మార్చారు. నాలుగు నెలలు గడిచినా పరిహారం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. డెత్ సర్టిఫికెట్ లేక ఆ కుటుంబాలకు బీమా డబ్బులు రాక, పరిహారం అందక నరకం అనుభవిస్తున్నారు. నిబంధనల పేరు చెప్పి, ఆచూకి దొరకని వారిని మృతులుగా పరిగణించడానికి 7 ఏళ్లు వేచి చూడమనడం మానవత్వం అనిపించు కుంటుందా? అన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం తరపున ప్రకటించిన రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా ఇప్పటికీ బాధితులకు అందలేదు. కేంద్రంతో మాట్లాడి ఆ డబ్బులు ఇప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు.

# కెటిఆర్, గోరటిలపై ఎన్నికల కేసు కొట్టివేత

హైదరాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి):

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నల కు తెలంగాణ హైకోర్టులో ఊరట దొరికింది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్లో వారిద్దరిపై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని నమోదైన కేసులో ఊరట లభించింది. 2023 ఎన్నికల సమయంలో తెలంగాణ సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల జ్యోతి వద్ద ఇంటర్వ్యూలు చేశారని కేటీఆర్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోడ్ ఉల్లంఘిస్తూ అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారనీ పోలీసులు కేసు పెట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా.. ప్రభుత్వ పథకాలపై గోరెటి వెంకన్నను కేటీఆర్ ఇంటర్వ్యూ చేశారని విచారణ సందర్భంగా పోలీసుల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ పార్టీకి లబ్ది చేకూర్చే విధంగా ఆ ఇంటర్వ్యూ ఉందని తెలిపారు. అయితే, రాజకీయ లబ్ది కోసమే కేసు నమోదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్, గోరెటి వెంకన్నపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

# దేవుడిని అడ్డంగా పెట్టుకుని సినిమాలు

## కనీస సామాజిక బాధ్యత లేని రాజమౌళి

## వారణాసి టైటిల్ వ్యాఖ్యలపై మండిపడ్డ మాధవీలత

హైదరాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి):

దర్శకుడు రాజమౌళి దేవుణ్ణి అడ్డంగా పెట్టుకొని డబ్బులు సంపాదిస్తున్నారని బీజేపీ నాయకురాలు మాధవి లత పేర్కొన్నారు. తాజాగా వారణాసి టైటిల్ రిలీజ్ సందర్భంగా రాజమౌళి చేసిన కామెంట్లపై మాట్లాడుతూ... నమ్మకాన్ని వ్యాపారంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. హిందువులు తేరగా దొరుకుతున్నారా? రాముడికి ఒకే పెళ్లాం ఉంది అంటున్న రాజమౌళికి ఎంతమంది పెళ్లాలు ఉన్నారని ప్రశ్నించారు. కర్మ ఫలితం అనుభవించాడు కాబట్టే ఆంజనేయుడు లేడని అన్నాడు.. సినిమా చూసే మా వాళ్లకు బుద్ధి ఉండాలని హిందువులను ఉద్దేశించి అన్నారు. వందల కోట్లు సంపాదించిన నీవు.. బాహుబలి సినిమాకి పనిచేసిన వారికి ఏమైనా ఇచ్చావా? అని నిలదీశారు. రాజమౌళి భక్తిని తీసుకురాలేదు? దాన్ని వాడుకుంటున్నారన్నారు. భక్తే లేదు అనే వాడి దగ్గరికి మనం వెళ్తామా? నీవు ఏమి దైవ సేవ చేశావ్.. అయిన దేవుడు అన్ని కోట్లు ఇచ్చాడు కదా..? అని నిలదీశారు. నీకు ఎందుకు అంతా బాధ.. మనమే మన హిందూ ధర్మాన్ని కించ పరుస్తున్నామన్నారు మాధవి లత.. 'మా కష్టం మీద విష బిందువు వేస్తున్నారు.. దయచేసి మీరు ఇలాంటి కామెంట్స్ చేయకు.. వ్యక్తి గతం అయితే ఇంట్లో మాట్లాడుకోవాలి.. ఆయన మాట్లాడింది వ్యక్తిగతం కాదు.. సినిమా వాళ్లు ఈ అంశంపై స్పందించక పోవడం వాళ్ల సొంతం.. అక్కినేని నాగేశ్వరరావు ఎప్పుడు దైవ దూషణ చేయలేదు.. మన మతం మీద మనమే సినిమాలు తీస్తూ దూసిస్తే ఎలా? సినిమా చూసే వాళ్లు కూడా భక్తి లేదని అనుకుంటే ఆయన వ్యాపారం తుస్సు మంటుంది.. ఆయనకు సామాజిక బాధ్యత లేదు.. టికెట్ కొనుక్కుని సినిమా చూసే వాళ్ళను అవమానించారు.. మనసు గాయ పరిచారు.. అందరూ నాస్తికులు అయితే నీ సినిమా చూసేది ఎవరు? నా దేవుళ్ళను ఒవైసీ బ్రదర్స్ అవమానించారని నేను రాజకీయాల్లోకి వచ్చాను.. నా దేవుళ్ళ పైకి ఎవరు వచ్చిన ఊరుకోను.. నాకు పదవి వచ్చిన రాకున్నా ఇలానే ఉంటా.. రాజమౌళి మాటల ప్రభావం పడుతుంది.. ఆంజనేయ స్వామిని అన్నావు కాబట్టే ఇప్పుడు నీకు చుట్టుకుంటుంది.. షూటింగ్ లలో దేవుణ్ణి ఇంకా ఏమన్నావో..? రాజమౌళి తో సమాధానం భగవంతుడు ఇప్పిస్తారు.. దేవుడు ఉన్నాడు అని ఆయనతోనే చెప్పిస్తారు.. బస్తీ మే సవాల్ చూడండి.. ఆయన మీద జాలి కూడా పోయింది.. రాముడి మీద అసహ్యంగా మాట్లాడారు.. ఆయనకు క్షమాపణకు కూడా అర్హత లేదు.. తగిన గుణపాఠం చెప్పాలి..' అని రాజమౌళిపై ఫైర్ అయ్యారు.

# దేవుళ్ల పేరుతో సినిమాలు తీస్తావ్

## నమ్మకం లేదంటావా రాజమౌళి - మండిపడ్డ ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి):

రాజమౌళి ప్రతి సినిమాను హిందూ సమాజం బహిష్కరించాలని ఎమ్మెల్యే రాజాసింగ్ పిలుపునిచ్చారు. ఇటీవల ఓ ఈవెంట్‌లో భాగంగా రాజమౌళి చేసిన వ్యాఖ్యలపై తాజాగా రాజాసింగ్ స్పందించారు. ప్రస్తుతం డైరెక్టర్ రాజమౌళికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోందన్నారు.. తన అమ్మానాన్నలకు హనుమంతుడిపై విశ్వాసం ఉంది కానీ.. తనకు లేదని రాజమౌళి అన్న మాటలను రాజాసింగ్ గుర్తు చేశారు. నీకు విశ్వాసం లేదు కానీ.. అదే ధర్మం, దేవుళ్లపై సినిమాలు చేసి.. రూ. కోట్లల్లో సంపాధించుకున్నావు కదా..? అని ప్రశ్నించారు. అసలు నీ ప్లాన్ ఏంది..? ఇప్పుడు వారణాసి పేరుతో మహేష్‌బాబును పెట్టి మరో సినిమా తీస్తున్నావ్.. ఈ మూవీ ప్రమోషన్‌లో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశావా? అని నిలదీశారు. లేదా నువ్వు నిజంగానే నాస్తికుడివా..? ఓ సారి డిక్లేర్ చేయ్యాలని డిమాండ్ చేశారు. అసలు నీ తప్పేం లేదు.. అసలు తప్పు హిందులదే అన్నారు. నీలాంటి నీశ్చపు డైరెక్టర్లను హిందువులు కనుగొనలేక పోతున్నారన్నారు. ధర్మం పట్ల, హిందూ దేవుళ్ల పట్ల నమ్మకం లేని రాజమౌళి సినిమాలు హిందువులు ఎందుకు చూడాలని రాజాసింగ్ నిలదీశారు. 'బాహుబలి సినిమా తీశావు.. ప్రభాస్‌తో శివలింగాన్ని ఎత్తించావు.. కోట్ల రూపాయలు సంపాధించుకున్నావు.. మళ్లీ మా హిందు దేవుళ్లపై నమ్మకం లేదని చెబుతున్నావు. రాజమౌళికి ఇది కొత్తేం కాదు.. భగవాన్ శ్రీకృష్ణుడికి చెందిన 16 వేల మంది దాసులను, లవర్స్ అంటూ హేళన చేశాడు. నాకు రాముడిపైన ఇష్టం లేదు.. రాముడి స్టోరీ బోరింగ్ స్టోరీ అని గతంలో ట్వీట్ చేశాడు. ఇప్పుడు హనుమంతుడిపైన కామెంట్స్ చేశాడు.. హిందువులకు ఓ సూచన.. ఇలాంటి డైరెక్టర్లపై కంప్లేంట్ ఇవ్వండి. ఇలాంటి వ్యక్తులను జైల్లో వేస్తేనే హిందూ దేవుళ్లపై కామెంట్స్ చేస్తే ఏం జరుగుతుందో తెలుస్తుంది. ఇలాంటి పనికిరాని డైరెక్టర్ సినిమాలు చూడొద్దు.. మనం ఇలాంటి వ్యక్తులు తీసిన సినిమాలు చూస్తాం.. వాళు వందలు వేల రూపాయలు సంపాధించుకుంటారు. ఇలా నాస్తికత్వం పేరుతో మన దేవుళ్లపై కామెంట్స్ చేస్తారు.. అందుకే ఈ డైరెక్టర్ సినిమాలు బ్యాన్ చేద్దాం..' అని రాజాసింగ్ వ్యాఖ్యానించారు.

# అంగారకుడి ఉపరితలంపై మిస్టీరియస్ శిల

## అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా గుర్తింపు

## రోవర్ పంపిన చిత్రాలపై మరిన్ని పరిశోధనలు

న్యూయార్క్,నవంబర్20(సమయజ్యోతి):

అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా అంగారకుడి ఉపరితలంపై మిస్టీరియస్ రాయిని గుర్తించింది. ఈ రాయి మార్స్ సహజ, భౌగోళిక నిర్మాణంతో పూర్తిగా భిన్నంగా కనిపిస్తున్నది. శాస్త్రవేత్తలు 80 సెంటీమీటర్ల పొడవున్న ఈ రాయికి 'ఫిప్సాక్స్‌లా' అని నామకరణం చేశారు. ప్రస్తుతానికి ఈ రాయిని ఎలియన్ రాక్‌గా పేర్కొంటున్నారు. ఈ రాయిని సెప్టెంబర్ 19న గుర్తించారు. నాసా పెర్సెవరెన్స్ రోవర్ పంపిన ఈ రాయిని చూసి నాసా శాస్త్రవేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రోవర్ జెజెరో క్రేటర్ సమీపంలోని వెర్నోడెన్ ప్రాంతంలోని రాళ్లపై అధ్యయనం జరుపుతున్నది. రోవర్ మాస్ట్‌క్యామ్-జెడ్ కెమెరా ఈ రాయిని గుర్తించి ఫొటో తీసింది. ఈ ఫొటోను నాసా బ్లాగ్ పోస్ట్‌లో షేర్ చేసింది. ఫిప్సాక్స్‌లా మరో సౌర వ్యవస్థకు చెందింది కావొచ్చునని తెలిపింది.ఈ రాయి చిన్న డెస్క్‌ను పోలి ఉంటుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. మరో సిద్ధాంతం ఏంటంటే ఇది ఉల్కాపాతం ఫలితంగా కూడా వచ్చి ఉండవచ్చని పేర్కొంటున్నారు. క్యూరియాసిటీ రోవర్ 2014లో రెండు మీటర్ల వెడల్పు లెబనాన్ ఉల్కను, 2023లో కాకో ఉల్కను గుర్తించింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు జెజెరో క్రేటర్‌లో ఇలాంటి లోహాలను గుర్తించాలని ఆశించారు. ఈ రాక్‌ను నాసా పరిశోధకుల బృందం గతవారంలో నిశితంగా పరిశీలించింది. రాయి ఆకారం, పరిమాణం, చుట్టుపక్కల ప్రాంతాల్లోని రాళ్లతో పోలిస్తే భిన్నంగా ఉందని పేర్కొంది. పెర్సెవరెన్స్ రోవర్ సూపర్‌క్యామ్ లేజర్, స్పెక్ట్రోమీటర్లతో చేసిన విశ్లేషణలో ఈ రాయిలో ఐరన్, నికెల్ మూలకాలు ఎక్కువ సాంద్రతతో ఉన్నట్లుగా గుర్తించారు. అంగారకుడి ఉపరితలంపై ఇలాంటి మూలకాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. గ్రహశకలాల కేంద్ర భాగాల్లో ఏర్పడే ఐరన్-నికెల్ ఉల్కలలో అధికంగా ఉంటాయి. ఈ క్రమంలో మరో సౌర వ్యవస్థ నుంచి మార్స్‌పైకి వచ్చి ఉండవచ్చని నాసా అంచనా వేస్తున్నది.

# జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో కీలక పరిణామం

## ఫైల్స్ విడుదల బిల్లుపై అధ్యక్షుడు ట్రంప్ సంతకం

వాషింగ్టన్,నవంబర్20(సమయజ్యోతి):

గతంలో అగ్రరాజ్యం అమెరికాను కుదిపేసిన జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన కీలక ఫైల్స్ విడుదలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను విడుదల చేసే బిల్లుపై ట్రంప్ సంతకం చేశారు. ఈ విషయాన్ని తన సోషల్ మీడియా ఖాతా ట్రూత్ ద్వారా వెల్లడించిన ట్రంప్.. ఈ సందర్భంగా డెమొక్రాట్లపై పలు ఆరోపణలు చేశారు. 'లైంగిక నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో డెమొక్రాట్లకు ఉన్న అనుబంధాల గురించి త్వరలోనే బయటపడవచ్చు. ఎందుకంటే నేను ఆ కేసుకు సంబంధించిన బిల్లుపై సంతకం చేశానని ట్రంప్ పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి బాలికలు, యువతలకు జెఫ్రీ ఎప్‌స్టీన్ డబ్బు ఆశ చూపించి ఇళ్లకు రప్పించి పలు అఘాయిత్యాలకు పాల్పడేవాడని అతడిపై ఆరోపణలు వచ్చాయి. ఆ ఆరోపణలు నిజమని తేలడంతో ఎప్‌స్టీన్‌ను అరెస్ట్ చేశారు. జైల్లో ఉన్న సమయంలోనే 2019లో అనుమానాస్పద స్థితిలో ఎప్‌స్టీన్ మరణించాడు. ఈ సెక్స్ కుంభకోణంలో ఎప్‌స్టీన్‌తో పాటు అమెరికాకు చెందిన పలువురు ప్రముఖులు కూడా ఉన్నట్టు వార్తలు వచ్చాయి.తన పరపతి పెంచుకోవడం కోసం జెఫ్రీ ఏళ్ల తరబడి టీనేజ్ అమ్మాయిలను ఎరగా వేశాడు. 2002-2005 మధ్య కాలంలో మైనర్ బాలికలను, యువతులకు డబ్బు ఆశ చూపించి తన మాన్‌హట్టన్ భవనం, పామ్ బీచ్ ఎస్టేట్, ఫ్లోరిడా, న్యూయార్క్, వర్జిన్ ఐలాండ్స్, మెక్సికోల్లోని నివాసాలకు పిలిపించి అఘాయిత్యాలకు పాల్పడేవాడని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలతో 2019 జులైలో ఎప్‌స్టీన్‌ను అరెస్ట్ చేశారు. ఇక అదే ఏడాది ఆగస్టు 10న మాన్‌హట్టన్ జైలు గదిలో అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన సన్నిహితుల జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా, మాజీ అధ్యక్షులు, రాజకీయ, వ్యాపార వేత్తలు కూడా ఉన్నట్లు ఇటీవలే వార్తలు వచ్చాయి. దీంతో ఎప్‌స్టీన్‌కు సబంధించిన అన్ని అంశాలు బహిర్గతం చేయాలని ఇటీవల అమెరికా న్యాయశాఖ ఆదేశాలు ఇవ్వడంతో ఈ వివాదం తెరపైకి వచ్చింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదల బిల్లును మంగళవారం ప్రతినిధుల సభ ముందుకు తీసుకురాగా.. 427-1 ఓట్లతో ఆమోదం లభించింది. తర్వాత సెనెట్‌లో దీనికి ఏకగ్రీవ ఆమోదం లభించడంతో.. తాజాగా ట్రంప్ దానిపై సంతకం చేశారు. ఇక ఈ జాబితాలో పలువురి రాజకీయ నేతలు, జర్నలిస్ట్‌లు, వ్యాపారవేత్తలు, బిజినెస్ అండ్ టెక్ టైకూన్స్, సినిమా వాళ్ల



పేర్లు తెరపైకి వచ్చాయి.

# అమెరికాతో 93 మిలియన్ డాలర్ల ఆయుధ ఒప్పందం

## అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ సరఫరాకు అంగీకారం

వాషింగ్టన్,నవంబర్20(సమయజ్యోతి):

భారత్-అమెరికాల మధ్య కీలకమైన రక్షణ ఒప్పందం కుదిరింది. దీంతో అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ మన దేశానికి అందనుంది. రష్యాతో పోరులో ఉక్రెయిన్‌కు వరంలా వచ్చిన ఈ ఆయుధానికి ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ ఉంది. భుజం మీద నుంచి గురిపెట్టి ప్రయోగించే ఈ మిసైల్.. కొన్ని వందల సంఖ్యలో రష్యన్ ట్యాంకులను పేల్చేసింది. ఈ క్రమంలో అమెరికాతో 93 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను భారత్‌కు విక్రయించేందుకు అగ్రరాజ్యం ఆమోదించింది. జావెలిన్ ట్యాంక్ విధ్వంసకర క్షిపణిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంఛ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్ విధ్వంసకర ఆయుధాన్ని ప్రయోగించిన ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటర్ క్షిపణిని బయటకు కొంతదూరం విసురుతుంది. ఆ తర్వాత క్షిపణి మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళుతుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడినుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు. ఈ లోపు ప్రయోగించిన వారు సురక్షిత ప్రదేశంలో దాక్కోవచ్చు. రీయాక్టివ్ ఆర్మర్ రక్షణ కవచాలను ఛేదించి.. ట్యాంకును ధ్వంసం చేసేలా దీనిలో రెండు దశల్లో పేలుడు పదార్థాలను అమర్చారు. తొలిదశలో కవచాన్ని ఛేదించి.. ఆ తర్వాత దశలో వార్‌హెడ్ ట్యాంక్‌ను ధ్వంసం చేస్తుంది. వీటిని అమెరికాకు చెందిన రక్షణరంగ దిగ్గజాలు రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు అభివృద్ధి చేశాయి. వీటి ఉత్పత్తి చాలా క్లిష్టమైన, ఖరీదైన వ్యవహారం. వీటి ధర 2 లక్షల డాలర్ల వరకూ ఉంటుందని అంచనా.రష్యాతో పోరులో ఉక్రెయిన్ ఈ క్షిపణులను విపరీతంగా వినియోగించింది. మాస్కోకు చెందిన పలు యుద్ధ ట్యాంకులను పేల్చేసింది. వీటి నుంచి తప్పించుకోవడం కోసం రష్యా తమ ట్యాంకులపై లోహపు బోన్లను అమర్చిందంటే.. వీటి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. మొత్తం 93 మిలియన్ డాలర్ల ఆయుధాలను విక్రయించేందుకు భారత్-అమెరికా మధ్య ఒప్పందం కుదిరింది. ఇందులో 45.7 మిలియన్ డాలర్ల విలువైన జావెలిన్ మిసైల్ వ్యవస్థలు, సంబంధిత హార్డ్‌వేర్‌ను అగ్రరాజ్యం అందించనుంది. దీంతోపాటు 47.1 మిలియన్ డాలర్ల విలువైన ఎక్స్‌కాలిబర్ ప్రొజె÷-టైల్స్, ఇతర సైనిక పరికరాలను విక్రయించనుంది. తొలివిడతలో భాగంగా జావెలిన్ ఎఫ్‌జీఎం-148 మిసైల్స్, 25 జావెలిన్ లైట్‌వెయిట్ కమాండ్ లాంఛ్ యూనిట్స్ వంటి వాటిని భారత్‌కు అందించనుంది.

# కర్నాటకలో మళ్లీ సిఎం రాజకీయం

## డికెకు పగ్గాలు అప్పగించాలంటున్న ఆయన వర్గం

బెంగళూరు,నవంబర్ 20(సమయజ్యోతి):

కర్ణాటకలో మళ్లీ పవర్ పాలిటిక్స్‌కు తెరలేచాయి. తాజాగా కర్ణాటక అధికార పార్టీ పంచాయితీ ఢిల్లీ హైకమాండ్‌కు చేరింది. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి రెండున్నరేళు పూర్తి చేసుకుంది. ఇప్పుడు డీకే శివకుమార్ వర్గం.. సీఎం సిద్ధరామయ్యను మార్చాలంటూ డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేలు ఢిల్లీ వెళ్తున్నారు. రాష్ట్రంలో డీకే శివకుమార్‌కు సీఎం పగ్గాలు ఇవ్వాలని ఆయన వర్గం ఎమ్మెల్యే కొరనున్నట్లు సమాచారం. అయితే రాష్ట్రంలో సీఎం మార్పు ఊహాగానాలే అంటూ సీఎం సిద్ధరామయ్య కొట్టిపారేశారు. కర్ణాటకలో పవర్ షేరింగ్‌పై ఇప్పుడు పవర్ పాలిటిక్స్ నడుస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కాంగ్రెస్ హైకమాండ్ రాష్ట్రంలో ఎవరిని సీఎం చేయాలనే దానిపై పెద్ద ఎత్తున చర్చలు జరిపింది. ఆ సమయంలో పీసీసీ చీఫ్‌గా ఉన్న డీకే శివకుమార్, గతంలో సీఎంగా పని చేసిన సిద్ధరామయ్య పేర్లు తెరపైకి వచ్చాయి. వాళ్లిద్దరిలో కూడా సీనియర్‌గా ఉన్న సిద్ధరామయ్య వైపు పార్టీ అధిష్టానం మొగ్గు చూపి సీఎంగా పగ్గాలు అప్పగించింది. అయితే ఆ సమయంలో పలు కీలక శాఖలతో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వర్గం ప్రమాణస్వీకారం చేసింది. ఆ సమయంలో ఈ ఇద్దరు నాయకుల మధ్య రాజీ జరిగిందనే చర్చ బయటికి వచ్చింది. వీరిద్దరి మధ్య 2.5 ఫార్మిలా సయోధ్య జరిగిందనే చర్చ కూడా జోరుగా ప్రచారం జరిగింది. మొదటి 2.5 ఏళ్లు రాష్ట్రంలో సిద్ధరామయ్య సీఎంగా ఉంటారని, తర్వాత కాలం డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా పని చేస్తారని ఒక రాజీ జరిగిందనే ప్రచారం బయటికి వచ్చింది. అందులో భాగంగా మొదటగా సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని డీకే వర్గం చెబుతుంది. కానీ ఇప్పుడు అనుకున్న సమయం ముగిసిన కూడా సీఎం కుర్చీ శివకుమార్‌కు ఎందుకు ఇవ్వడం లేదనే దానిపై ఆయన వర్గం వాళ్లు ప్రశ్నలు సంధిస్తున్నారు. గత వారమే సిద్ధరామయ్య, శివకుమార్ ఇద్దరు కూడా ఢిల్లీకి వెళ్లారు. ఆ సమయంలో వాళ్లిద్దరూ హైకమాండ్ పెద్దలతో విడివిడిగా సమావేశం అయ్యారు. పార్టీ పెద్దలకు రాష్ట్రంలోని పరిస్థితులు, ముఖ్యమంత్రి మార్పు అంశంపై వాళ్లిద్దరూ చర్చించినట్లు సమాచారం. అయితే ఆ సమయంలోనే హైకమాండ్ సీఎం మార్పుపై ఏ విషయం అయినా తామే నిర్ణయం తీసుకుంటామని, ఎవరు కూడా ఎటువంటి ఊహాగాలకు పోవద్దని, దీనిపై ఎక్కడ కూడా మాట్లాడవద్దని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ ఢిల్లీ పర్యటన తర్వాత ఇద్దరు నాయకులు కూడా సైలెంట్‌గా ఉన్నప్పటికి ఇప్పుడు డీకే శివకుమార్ వర్గానికి చెందిన కొందరు ఎమ్మెల్యేలు హస్తినకు బాట పడుతున్నారు. ఈ రాత్రి వాళ్లు బెంగళూరు నుంచి ఢిల్లీకి వెళ్లి పార్టీ పెద్దలను కలిసి డీకే శివకుమార్‌ను సీఎంను చేయాలనే ఒక డిమాండ్‌ను చేసే ఛాన్స్ ఉందని సమాచారం. డీకే వర్గం ఎమ్మెల్యేలు పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను కలుస్తారా, లేదంటే రాహుల్ గాంధీని కలుస్తారా అనేది మాత్రం ఇంకా అధికారికంగా బయటికి రాలేదు.

# ఢిల్లీ ఎర్రకోట పేలుళ్ల ఘటన

## శ్రీనగర్‌లో మరో నలుగురిని

## అరెస్ట్ చేసిన ఎన్ఐఎ

న్యూఢిల్లీ,నవంబర్ 20(సమయజ్యోతి):

ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్లతో సంబంధం ఉన్న మరో నలుగురు నిందితులను ఎన్ఐఎ పట్టుకుంది. గురువారం శ్రీనగర్‌లో వీరిని అరెస్ట్ చేసింది. దీంతో ఈ దాడితో సంబంధం ఉన్న మొత్తం అరెస్టులు 6కి పెరిగాయి. నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర జరిగిన పేలుడు ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తోన్న సంగతి తెలిసిందే. జిల్లా సెషన్స్ జడ్జి, పాటియాలా హౌస్ కోర్టు జారీ చేసిన ఆర్డర్ల మేరకు నలుగురు నిందితులను జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారిని జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనై, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌కు చెందిన డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన డాక్టర్ షాహీన్ సయీద్ ఇంకా, జమ్మూ కాశ్మీర్‌లోని షోపియన్‌కు చెందిన ముఫ్తీ ఇర్ఫాన్ అహ్మద్ వాగేగా గుర్తించారు. వీరందరూ ఢిల్లీ బ్లాస్ట్ లో ముఖ్యమైన పాత్ర పోషించారని దర్యాప్తు ఏజెన్సీ చెబుతోంది. టీవల ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఎన్ఐఏ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పేలుడుకు ఉపయోగించిన కారు ఎవరి పేరున రిజిస్టర్ అయిందో అతనైన(అమీర్ రషీద్ అలీ)ని, దాడిలో పాల్గొన్న ఉగ్రవాదికి సాంకేతిక సహాయం అందించిన డానిష్ అలియాస్ జాసిర్ బిలాల్ వాని లను ఔఎం అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో పూర్తి కుట్రను వెలికితీసే ప్రయత్నాలలో భాగంగా వీరిద్దరినీ ఇంటరాగేట్ చేస్తోంది.కాగా, ఈ పేలుడు ఘటన జరిగిన వెంటనే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దీనిపై దర్యాప్తును ఎన్ఐఏ కి అప్పగించింది. దాడికి కారణమైన గ్రూపులోని ప్రతి సభ్యుడిని గుర్తించి అరెస్టు చేయడానికి ఏజెన్సీ వివిధ రాష్ట్ర పోలీసు దళాలతో కలిసి పనిచేస్తోంది. నవంబర్ 10న ఢిల్లీలోని నేతాజీ సుభాష్ మార్గ్‌లో ముష్కరమూకలు జరిపిన పేలుడులో 15 మంది మరణించారు.

# రాజమౌళి వ్యాఖ్యలు హిందువులను కించపర్చడమే

## దేవుడిపై నమ్మకం లేకపోతే ఇంట్లో మాట్లాడుకోవాలి

## అదే దేవుడిని అడ్డం పెట్టుకుని సంపాదిస్తున్నారుగా

## బిజెపి అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ ఫైర్

అమరావతి,నవంబర్ 20(సమయజ్యోతి):

ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ ఫైర్ అయ్యారు. రాజమౌళి సినిమాలు చూసి హిందూ దేవుళ్లపై గౌరవం ఉందనుకున్నాం అని, ఆయన కామెంట్లపై హిందువులు ఇప్పుడు రగిలి పోతున్నారన్నారు. ఆంజనేయుడిపై నమ్మకం లేదనడం హిందువుల మనోభావాలు దెబ్బతీయడమే అని ధ్వజమెత్తారు. అంత పేరు, అంత డబ్బు, ప్రతిష్ట హిందూ దేవుళ్లను ఉపయోగించుకుని తెచ్చుకుంటారని విమర్శించారు. హిందూ దేవుళ్లని, సనాతన ధర్మాన్ని అవమానించే హక్కు ఎవరిచ్చారని,.. హిందూ సమాజం చులకనగా కనిపిస్తోందా అని రాజమౌళిని యామిని శర్మ ప్రశ్నించారు. గురువారం విజయవాడలో సాధినేని యామిని శర్మ మీడియాతో మాట్లాడుతూ? 'చట్ట ప్రకారంగా ఏమైనా చేసుకోవచ్చు. సంబంధం లేకుండా హిందూ దేవుళ్లను అంటే ఊరుకోం. దర్శకుడిగా రాజమౌళికి పేరు రావడానికి ఆ దేవుడే కారణం. ఏదో ఒక విధంగా రామ, కృష్ణ అనడం వల్లనే ఆ స్థాయి వచ్చింది. వ్యక్తిగత అంశాలతో హిందూ దేవుళ్లపై కామెంట్ చేస్తే ఊరుకోం అని ఘాటుగా హెచ్చరించారు. సినీ ఇండస్ట్రీలో కొంతమంది అహంకారంతో మాట్లాడితే ఏం జరిగిందో అందరికీ తెలుసు. ఒళ్ళు దగ్గర పెట్టుకుని, స్పృహలో ఉండి మాట్లాడాలి. మనోభావాలు దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదు. సనాతన ధర్మానికి నిరూపణలు అవసరం లేదు.. వీళ్ళెవరు నిరూపించడానికి. మీరు సినిమాలు చేసుకోండి.. మీ టీజర్ల కోసమో, మీ పబ్లిసిటీ కోసమో వినియోగించుకోవడానికి దేవుడు కమర్షియల్ కాదు' అని యామిని శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు.సూపర్ స్టార్ మహేష్ బాబుతో రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' సినిమా టైటిల్ గ్లింప్స్ తాజాగా విడుదలైన విషయం తెలిసిందే. టైటిల్ గ్లింప్స్ విడుదల కోసం పెద్ద ఎత్తున రాజమౌళి ఓ ఈవెంట్ నిర్వహించారు. గ్లింప్స్ విడియో రిలీజ్‌కు పదే పదే సాంకేతిక ఆటంకాలు ఎదురుకావడంతో.. రాజమౌళి నిరాశ చెంది హనుమంతుడిపై కామెంట్స్ చేశారు. దేవుడి పైన తనకు పెద్దగా నమ్మకం లేదని, హనుమంతుడు తన వెనుకాల ఉండి నడిపించారని నాన్న చెప్పినపుడు వెంటనే కోపం వచ్చిందన్నారు. హనుమంతుడు ఉంటే ఇదేనా నడిపించేది అని రాజమౌళి అసహనం వ్యక్తం చేశారు. ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# బాలకృష్ణకు మరో అరుదైన గౌరవం

## గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఘనంగా సన్మానం

అమరావతి,నవంబర్ 20(సమయజ్యోతి):

నటుడు నందమూరి బాలకృష్ణకు మరో అరుదైన గౌరవం దక్కింది. గోవా వేదికగా గురువారం వైభవంగా ప్రారంభమైన 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా'వేడుకలో బాలయ్యను సన్మానించారు. నటుడిగా 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బాలకృష్ణకు ఈ గౌరవం దక్కింది. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, గోవా సీఎం ప్రమోద్ సావంత్ బాలకృష్ణను శాలువాతో సత్కరించారు. 50 ఏళ్ల నట ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న రజనీకాంత్‌ను కూడా ముగింపు వేడుకలో సన్మానించనున్నారు. ఈ నెల 28 వరకూ ఈ వేడుక కొనసాగనుంది.

# మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి అవయవ దానం



సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ గ్రామానికి చెందిన పెర్కిట్ మాజీ ఉపసర్పంచ్ మాజీ కౌన్సిలర్ ఇట్టేడి నర్సారెడ్డి మృతి చెందారు. తన భర్త చనిపోతు నలుగురికి సహాయ పడాలని ఉద్దేశంతో అవయవాలను కొంతమంది బాధిత పేషెంట్లకు దానం చేయడానికి మృతుని సతీమణి సునీత ముందుకు రావడం ప్రశాంసనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.

# దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డిలు మావద్ద లేరు

## హైకోర్టుకు తెలిపిన పోలీసులు

**అమరావతి,నవంబర్20(సమయజ్యోతి):**

మావోయిస్టు నాయకులు దేవజీ, మల్లా రాజిరెడ్డి కోర్టులో హాజరు పర్చాల్సిందిగా కోరుతూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో పిటిషనర్లు చేసిన అభ్యర్థనపై కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణలో భాగంగా, దేవజీ, మల్లా రాజిరెడ్డి తమ అదుపులో లేరని పోలీసులు హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నాయి. అలాగే, అరెస్ట్ చేసిన మావోయిస్టులను సంబంధిత మేజిస్ట్రేట్ ఎదుట నియమిత విధానంలోనే హాజరుపర్చినట్లు కూడా పోలీసులు వివరణ ఇచ్చారు. అయితే, మావోయిస్టు నేతలు తమ అదుపులో ఉన్నారని పోలీసులు ముందుగా ప్రెస్ స్టేట్మెంట్ రిలీజ్ చేశారని పిటిషనర్ వాదించారు. దీనిపై స్పందించిన పిటిషనర్ తరఫు న్యాయవాది, ఆ ప్రెస్ స్టేట్మెంట్‌ను కోర్టు ముందు సమర్పిస్తామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, మావోయిస్టులు పోలీసుల ఆధీనంలోనే ఉన్నారని నిరూపించే ఆధారాలను సమర్పించాలని పిటిషనర్లకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణను శుక్రవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

# కుప్పం ప్రజలకు అండగా ఉంటా

## స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ

## రెండ్రోజుల పర్యటనలో నారా భువనేశ్వరి

**కుప్పం,నవంబర్ 20(సమయజ్యోతి):**

కుప్పం నియోజకవర్గ ప్రజలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ భవన్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. కుప్పంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం శాంతిపురంలోని తన నివాసంలో నారా భువనేశ్వరి గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి అర్జీలను ఆమె స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో నారా భువనేశ్వరిని కలిశారు. స్వచ్ఛ భారత్ అవార్డులు గెలుచుకున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను ఆమె అభినందించారు. దయాళ్ శ్రవణ్ ఫౌండేషన్ స్పాన్సర్ చేసిన వినికిడి పరికరాలను పంపిణీ చేశారు.అనంతరం డీకే పల్లి వద్ద కృష్ణా జలాలకు ఆమె జలహారతి ఇచ్చారు. అంతకు ముందు గంగమ్మ ఆలయంలో నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణమ్మకు చీర సారె అందించడం తన పూర్వజన్మ సుకృతమని ఆమె పేర్కొన్నారు. కుప్పంలో ఇలా శ్రీశైలం నుంచి వచ్చిన కృష్ణా జలాలను చూడడం తన జన్మలో మర్చిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో మహిళలు తరలి వచ్చారు. కుప్పంలో నారా భువనేశ్వరి నాలుగు రోజుల పాటు పర్యటించనున్నారు. అందుకోసం బుధవారం ఆమె కుప్పం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కుప్పం, శాంతిపురం, గుడిపల్లి, రామకుప్పం మండలాల్లో నారా భువనేశ్వరి పర్యటించనున్నారు.



# కాంగ్రెస్ గెలిచినా.. బాబు గెలిచినా కాపుల చలవే

## రేపల్లె కాపు కార్తీక సమారాధనతో

## అంబటి రాంబాబు

**గుంటూరు,నవంబర్ 20(సమయజ్యోతి):**

1989లో కాంగ్రెస్ గెలవడానికి, 2024 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు సీఎం కావడానికి కాపులే కారణం అని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. కాపులు సీఎం అయినా, కాకపోయినా.. ముఖ్యమంత్రిగా ఎవరు ఉండాలన్నది అప్పుడప్పుడు నిర్ణయిస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో రేపల్లెలో కాపు అభ్యర్థి పోటీలో ఉండాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. తాను మాత్రం రేపల్లెకు వచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. మహానాడును మించి నిర్వహించాలనే ఉద్దేశంతోనే కృష్ణా తీరంలో కాపునాడు పెట్టారని అంబటి రాంబాబు చెప్పుకొచ్చారు. రేపల్లెలో కాపు కార్తీక సమారాధన సమావేశం జరిగింది. ఈ సమావేశం వివిధ పార్టీల కాపు నేతలు హాజరయ్యారు. వంగవీటి మోహన రంగా కుమార్తె ఆషా కిరణ్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ? 'రంగా కుమార్తె రాజకీయాల్లోకి వస్తారో రారో తెలియదు. వారు ఎక్కడున్నా కాపుల ఆశీస్సులు ఉంటాయి. నేను 1989లో గెలవటానికి రంగా హత్య కూడా ఒక కారణం. కాపులు సీఎం అయినా, కాకపోయినా.. ముఖ్యమంత్రిగా ఎవరు ఉండాలన్నది అప్పుడప్పుడు నిర్ణయిస్తారు. 1989లో కాంగ్రెస్ గెలవటానికి, గత ఎన్నికల్లో చంద్రబాబు సీఎం కావటానికి కాపులే కారణం. వచ్చే ఎన్నికల్లో రేపల్లెలో కాపు అభ్యర్థి పోటీలో ఉండాలని కోరుకుంటున్నాను. నేను మాత్రం రేపల్లెకు వచ్చే అవకాశం లేదు. మహానాడును మించి నిర్వహించాలనే ఉద్దేశంతోనే కృష్ణా తీరంలో కాపునాడు పెట్టారు. ఆ కాపునాడు సమావేశాన్ని దేశమే గుర్తించింది. నేను ఎస్ జగన్ కాపు కాస్తున్నట్లు కొంతమంది పొగుడుతుంటే.. మరికొంత మంది తిడుతుంటారు. రంగా హత్యతోనే అప్పటి ప్రభుత్వాన్ని కాపులు దించేశారు' అని అన్నారు.



# లొంగిపోతే ప్రభుత్వ పక్షాన సాయం

## నక్సల్స్ జనజీవన స్రవంతిలోకి రావాలి: డిజిపి

**రంపచోడవరం,నవంబర్ 20(సమయజ్యోతి):**

లొంగిపోయిన నక్సల్స్‌కు అన్ని విధాలా ప్రభుత్వ సహకారం ఉంటుందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. చాలామంది ఇప్పటికే లొంగిపోయారని, మిగతావారు సైతం లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులు లేని రాష్ట్రంగా చేయడమే పోలీసుల లక్ష్యమని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. అల్లూరి జిల్లా రంపచోడవరం మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిన స్థలాన్ని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా మావోయిస్టుల ఏరివేత కొనసాగుతుందని, ఆరు నెలలుగా రాష్ట్రంలో మావోయిస్టుల కోసం సంభవ్ ఆపరేషన్ పేరిట గాలింపు చర్యలు ముమ్మరం చేశామని, అందులో భాగంగా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, టెక్ శంకర్‌తో పాటు దళాలకు చెందిన 13 మంది హతమయ్యారని, 50 మందిని అరెస్టు చేశామని వివరించారు.ఇప్పటికైన మావోయిస్టుల్లో మిగిలిన వారు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలువాలని సూచించారు. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతూనే ఉంటుందని వెల్లడించారు. మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేయాలనే లక్ష్యంతో, శాంతి భద్రతలు కాపాడేందుకు ఏపీ పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

# తుపాను హెచ్చరికల నేపథ్యం

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

## తాడేపల్లి మండలంలో ధాన్యం సేకరణపై ఆరా

## క్షేత్రస్థాయిలో పర్యటించిన రైతులతో చర్చించిన నాదెండ్ల

**గుంటూరు,నవంబర్ 20(సమయజ్యోతి):**

తుపాను హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. కొనుగోళ్లలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో 3వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని వివరించారు. ధాన్యం అమ్మిన కేవలం 4 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావూరు, పాతూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి పరిశీలించారు. 17శాతం లోపే తేమ ఉండాలనేది కేంద్రం పెట్టిన నిబంధన అని... దాన్ని మాత్రమే అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. మిల్లర్లు అక్రమాలకు పాల్పడితే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతుల వద్ద నుండి ప్రతి ధాన్యం బస్తా కొనుగోలు చేస్తామని, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.రైతులను వివరాల అడిగి తెలుసుకున్నారు. ముందుగా ప్రాతూరు గ్రామంలోని వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చిర్రావూరు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతుల పడ్డ ఇబ్బందులను తెలుసుకొని, రాష్ట్రవ్యాప్తంగా నాలుగువేల రైతు సహాయ కేంద్రాలు ను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ధాన్యం కొనుగోలు చేయడమే కాక, రైతుల ఖాతాల్లో మూడు గంటల్లోనే నగదు జమ చేస్తున్నామన్నారు. 4 వేల కోట్లు ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉందన్నారు. 17 శాతం నుండి 24 శాతం వరకు రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి వినతి చేస్తామన్నారు. రైతుకు మద్దతు ధర ఇచ్చేందుకు ప్రభుత్వ సూచనల మేరకు ముందుకు వెళ్తామని, కూటమి ప్రభుత్వం రైతుల పక్షం ఉంటుందని ఆయన తెలిపారు. 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, బస్తా 1792 రూపాయలకు కొనుగోలు చేయనున్నామన్నారు. 20369, 20389 రకం ధాన్యం రైతుల నుండి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, సివిల్ సప్లై ఎండి తులసి, తాడేపల్లి తహసిల్దార్ డి సీతారామయ్య, జనసేన రాష్ట్ర నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ తుపాన్ హెచ్చరికలు

## అప్రమత్తం అయిన ప్రభుత్వం

**అమరావతి,నవంబర్ 20(సమయజ్యోతి):**

ఉపరితల ఆవర్తన ప్రభావంతో శనివారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ గురువారం అమరావతిలో వెల్లడించింది. ఇది పశ్చిమ -వాయువ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఆ తదుపరి 48 గంటల్లో ఇది పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణిస్తూ నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడేందుకు అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. అత్యవసర సహాయం కోసం.. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 1800 42 50101 సంప్రదించాలని రైతులకు విపత్తుల నిర్వహణ సంస్థ విజ్ఞప్తి చేసింది. ఇక శుక్రవారం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. ఈ నేపథ్యంలో నవంబర్ 27 నుంచి 29వ తేదీ వరకు అంటే.. గురు, శుక్రు, శనివారాల్లో.. కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. వరి కోతల నేపథ్యంలో రైతులు ముందుగానే వ్యవసాయ పనుల్లో తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. అలాగే పండిన ధాన్యాన్ని జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని స్పష్టం చేసింది.

# కేంద్రమంత్రితో ఎంపి భేటీ

**కర్నూలు,నవంబర్ 20(సమయజ్యోతి):**

కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఫుడ్ అండ్ ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఢిల్లీలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ నాగరాజు పాల్గొన్నారు. అనంతరం మంత్రి కార్యాలయం ల ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు జిల్లాలోని ఆహార శాఖ కు సంబంధించిన పలు అంశాల పై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తో చర్చించారు.

# నకిలీ సంస్థలకు విరాళాలు ఇవ్వొద్దు: టిటిడి ఛైర్మన్

**తిరుమల,నవంబర్ 20(సమయజ్యోతి):**

భక్తులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్న సంస్థలకు ఎట్టి పరిస్థితుల్లోనూ విరాళం ఇవ్వవద్దని టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు విజ్ఞప్తి చేశారు. గ్లోబల్ హిందు హెరిటేజ్ ఫౌండేషన్,షేవ్ టెంపుల్స్ డాట్ ఆర్గనైజేషన్ పేర్లతో వ్యవహరిస్తున్న కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ మోసపూరిత చర్యలతో విరాళాలు సేకరించేందుకు భక్తులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.నవంబర్ 29న తిరుమల, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాలను పుణ్యక్షేత్రాలుగా ప్రకటించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అనుమానాస్పద సంస్థలకు విరాళాలు ఇవ్వకుండా, వారి వలలో పడకుండా భక్తులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# కల్తీ నెయ్యి కేసులో వైవి విచారణ

**హైదరాబాద్,నవంబర్ 20(సమయజ్యోతి): :**

టీటీడీ కల్తీ నెయ్యి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో వైఎస్సార్ సిపి పార్టీ నేత వైవి సుబ్బారెడ్డిని సిట్ బృందం గురువారం విచారించింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లోని ఆయన నివాసానికి సిట్ అధికారుల బృందం చేరుకుని టీటీడీ కల్తీ నెయ్యి కేసులో ఆయన ఇంట్లోనే విచారిస్తోంది. ఇప్పటికే ఈ కేసులో వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్నతో పాటు టీటీడీ మాజీ ఈవోతో పాటు పలువురు అధికారులను సిట్ విచారించింది. వారు చెప్పిన సమాచారం మేరకు సిట్ వైవీ సుబ్బారెడ్డిని విచారిస్తోంది. సిట్ అధికారులు పలువురి స్టేట్మెంట్స్ తో పాటు పలు డాక్యుమెంట్స్ తీసుకొచ్చారు. వాటిని ముందుంచి వైవీ సుబ్బారెడ్డిని విచారించారు.

# బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

## 48 గంటల్లో వాయుగుండంగా

## మారే అవకాశం

**అమరావతి,నవంబర్ 20(సమయజ్యోతి):**

నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం, రాబోయే 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశాలు ఉండడంతో ఆంధ్రప్రదేశ్‌కు తుపాను ప్రమాదం పొంచి ఉందని వాతావరణ అధికారులు వెల్లడించారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడి పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ వాయుగుండంగా బలపడే అవకాశంముందని పేర్కొన్నారు.కొనసాగుతున్న అల్పపీడనం కారణంగా రాబోయే 24 గంటల్లో ప్రకాశం, బాపట్ల,కృష్ణా, తిరుపతి, చిత్తూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడవచ్చని తెలిపారు. శని, ఆదివారాల్లో ఓ మోస్తారు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించారు. అల్లూరి జిల్లా జి.మాడుగులలో4.6 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ముంచంగిపట్టులో 5.8, చింతపల్లిలో 6.8, డుంబ్రిగూడలో 7.8 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# కోర్టుకు వెళ్లేందుకు ఇంత హంగామానా?

## జగన్ తీరుపై మండిపడ్డ

## టిడిపి నేత బుద్దా వెంకన్న

**అమరావతి,నవంబర్ 20(సమయజ్యోతి):**

కోర్టుకు వెళ్తూ పెళ్లి పీటలు ఎక్కే వాడిలా బిల్డప్ ఇస్తూ జగన్ కోర్టు బోనులోకి వెళ్లారంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు సిగ్గు శరం ఉందో లేదో అర్థం కావడం లేదని మండిపడ్డారు. 12 ఏళ్లుగా బెయిల్ మీద ఉండి రాష్ట్రాన్ని రాక్షస పాలనతో విధ్వంసం చేశారని విమర్శించారు. ఈమేరకు వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మరోసారి ధ్వజమెత్తారు. బిహార్ సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పేదలకు సేవ చేసే నాయకులు వెళ్లారని... జగన్ తప్పులు చేశారు కాబట్టి కోర్టులో ఉన్నారని.. ఇదే దేవుడి స్క్రిప్ట్ అని అన్నారు. 2020లో సీఎంగా నాంపల్లి కోర్టులో హాజరు అయ్యారని.. ఈరోజు పులివెందుల ఎమ్మెల్యేగా హాజరు కావడం నిజమైన స్క్రిప్ట్ అంటూ దుయ్యబట్టారు. ఇప్పటివరకు న్యాయస్థానాలకు రాకుండా కుంటి సాకులతో వాయిదాలు వేయించారని మండిపడ్డారు. ప్రజల కోసం వచ్చినట్లు రూట్ మ్యాప్‌లు ఇచ్చి కోర్టుకు వెళ్లడం హాస్యాస్పదమన్నారు. కోర్టుకు వచ్చే టైమ్ కూడా జగనే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. న్యాయవ్యవస్థనూ జగన్ అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. జగన్‌లా చంద్రబాబు ఎప్పుడూ అవినీతి కేసులుపై జైలుకు వెళ్లలేదన్నారు. చంద్రబాబును అరెస్ట్ చేస్తే 110 దేశాల్లో ఆయన కోసం ఆందోళనలు చేశారని... అదీ బాబు ట్రాక్ అంటూ చెప్పుకొచ్చారు. జగన్ సీఎంగా ఉన్నా, ప్రతిపక్షంగా ఉన్నా, ఎమ్మెల్యేగా ఉన్నా ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ లాంటి వ్యక్తులు బెయిల్ మీద ఉండటం ప్రమాదకరమని.. తన మాటను సుమోటోగా తీసుకుని జగన్‌కు బెయిల్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేవుడిపై నమ్మకం ఉంటే జగన్ చేసిన తప్పులు ఒప్పుకుని జైలుకు వెళ్లాలన్నారు. కోర్టుల వద్ద కేరింతల సంస్కృతి ఎక్కడా చూడలేదని తెలిపారు. న్యాయ వ్యవస్థనూ భయభ్రాంతులకు గురిచేసే కుట్ర ఇది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్ కులమతాల మధ్య చిచ్చు పెట్టి విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. చెన్నారెడ్డి సీఎంగా ఉన్నప్పుడు మత ఘర్షణలు చేయించిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డిది... ఇప్పుడు అదే మాదిరిగా జగన్ వ్యవహరిస్తున్నారంటూ బుద్దా వెంకన్న విరుచుకుపడ్డారు.

# వన్డే సిరీస్‌కు టీమిండియా కెప్టెన్‌గా రాహుల్!

## దక్షిణాఫ్రికా వన్డేతో రోహిత్, కోహ్లీ పునరాగమనం

భారత్ –దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. మొదటి టెస్ట్ 30 పరుగుల తేడాతో ఓడిపోయిన తర్వాత, టీమ్ ఇండియా ఇప్పుడు నవంబర్ 22 నుంచి గౌహతిలో రెండో టెస్ట్ ఆడనుంది. దీని తరువాత, రెండు జట్లు నవంబర్ 30 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తలపడనున్నాయి. వన్డే సిరీస్ కోసం బీసీసీఐ ఎలాంటి జట్టును సిద్ధం చేస్తుందో చాలా పేర్లు బయటకు వచ్చాయి. ఈసారి చాలా పెద్ద పేర్ల పునరాగమనం చర్చను మరింత పెంచింది. వన్డే సిరీస్‌కు కెప్టెన్సీ కెఎల్ రాహుల్‌కు దక్కే అవకాశం ఉంది. శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా ఆడటం అనుమానంగా ఉంది. అటువంటి పరిస్థితిలో, రాహుల్‌ను కెప్టెన్‌గా నియమించడం దాదాపు ఖాయం. భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే మ్యాచ్‌లు నవంబర్ 30, డిసెంబర్ 3, డిసెంబర్ 6 తేదీల్లో జరగనున్నాయి.చాలా కాలం తర్వాత వన్డేల్లో భారత్ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్ళు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఒకేసారి కనిపించారు. ఆస్ట్రేలియాతో జరిగిన ఇటీవలి వన్డే సిరీస్‌లో రోహిత్ అద్భుత ప్రదర్శన చేశాడు. ప్రారంభ మ్యాచ్‌లో తక్కువ పరుగులు చేసిన తర్వాత, అతను రెండో వన్డేలో అర్ధ సెంచరీ, మూడవ మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీ సాధించి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. విరాట్ కోహ్లీ కూడా తన క్లాస్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన తర్వాత, అతను మూడవ వన్డేలో 74 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి భారత్‌ను గెలిపించాడు. ఛేజింగ్‌లో తనకంటే గొప్పవారు లేరని మరోసారి నిరూపించాడు. దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్‌లో ఈ జోడీ జట్టుకు రన్ మెషిన్ అవుతుందని భావిస్తున్నారు. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఆసియా కప్‌లో గాయపడిన తర్వాత ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు. అతని రాక టీమ్ ఇండియా బ్యాలెన్సింగ్‌ను మరింత బలోపేతం చేస్తుంది. హార్దిక్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ముఖ్యమైన పాత్ర పోషిస్తాడు. వేగవంతమైన బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు ఆస్ట్రేలియాతో జరిగిన %ాణ×% సిరీస్‌లో విశ్రాంతి ఇచ్చారు, కాని ఇప్పుడు అతను కూడా వన్డే సిరీస్‌లో తిరిగి రావచ్చు. అతని ఉనికి భారత బౌలింగ్‌కు పదును పెడుతుంది. అదేవిధంగా, దేశవాళీ క్రికెట్‌లో నిరంతరం పరుగులు సాధిస్తున్న రుతురాజ్ గైక్వాడ్‌కు కూడా జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. అతని ఫామ్, స్థిరత్వం జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్.





# 2026 మినీ వేలాన్ని ఆపేయండి

## భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప

ఐపీఎల్ 2026 మినీ వేలాన్ని ఆపేయాలని బీసీసీఐకి భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప సూచించాడు. ఈ వేలం ప్రక్రియను ఆపేసి ఏడాది పాటు ఆటగాళ్లను ట్రేడ్ చేసుకునే అవకాశం కల్పించాలన్నాడు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఐపీఎల్‌లో మార్పులు చేయాలని తెలిపాడు. రెండున్నర నెలల పాటు నిర్వహిస్తున్న ఈ టోర్నీని 6 నెలల టోర్నీగా మార్చాలని సూచించాడు. ఐపీఎల్‌లో కేకేఆర్‌కు ప్రాతినిథ్యం వహించిన రాబిన్ ఊతప్ప 205 మ్యాచ్‌లు ఆడి 4952 పరుగులు చేశాడు. 2014లో కేకేఆర్ టైటిల్ గెలవడంలో రాబిన్ ఊతప్ప 660 పరుగులతో కీలక పాత్ర పోషించాడు. తాజాగా ఐపీఎల్ గురించి మాట్లాడిన రాబిన్ ఊతప్ప.. లీగ్ స్వరూపాన్ని మార్చాలన్నాడు.'ఐపీఎల్ టోర్నీని స్టార్టప్ దశకు మించి తీసుకెళ్లడం లేదు. ప్రపంచంలోనే అత్యుత్తమ క్రికెట్ లీగ్ ఇది. మారుతున్న కాలానికి అనుగుణంగా టోర్నీని మార్చాలి. వేలం ప్రక్రియను నిలిపేసి ఏడాది పాటు ట్రేడ్ విండో తెరిచి ఉంచాలి. వేలాన్ని పక్కన పెట్టి డ్రాఫ్ట్ సిస్టమ్‌ను తీసుకు రావాలి. నేను ఐపీఎల్ ఆడుతున్నప్పటి నుంచి ఈ విషయం చెబుతున్నా. కానీ వారు టీవీ వినోదం గురించి మాత్రమే ఆలోచిస్తున్నారు. డ్రాఫ్ట్ విధానం అంతకంటే గొప్పది కావొచ్చు. ఇది అభిమానులను ఆకట్టుకుంటుంది. దీన్ని అమలు చేయండి. అంతేకాకుండా ఐపీఎల్ 6 నెలల లీగ్‌లాగా ఉండాలని నేను భావిస్తున్నాడు. మధ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లను నిర్వహించాలి. కానీ, ఐపీఎల్ అభివృద్ధి చెందాలి'అని రాబిన్ ఊతప్ప పేర్కొన్నారు. డ్రాఫ్ట్ సిస్టమ్ అంటే ఆటగాళ్లను సమాన పద్దతిలో జట్లకు కేటాయించడానికి ఉపయోగించే విధానం. అత్యుత్తమ ప్రతిభను కనబర్చే క్రికెటర్లపై ఒక ఫ్రాంచైజీ గుత్తాధిపత్యం ఉండకుండా జట్ల బలబలాల మధ్య సమతుల్యం తీసుకురావడానికి దీన్ని ప్రవేశ పెట్టారు. డ్రాఫ్ట్‌లో అర్హత ఉన్న ఆటగాళ్ల సమూహం నుంచి జట్లు వంతులవారీగా ఎంపిక చేసుకుంటాయి.

# బంగారు పతకానికి కూతవేటు దూరంలో..

## ప్రపంచకప్ ఫైనల్‌లో

## బాక్సర్ నిఖత్ జరీన్

ప్రపంచ బాక్సింగ్ కప్ 2025 టోర్నీలో భారత మహిళా బాక్సర్ నిఖత్ జరీన్ ఆధిపత్యాన్ని చలాయిస్తుంది. ఇప్పటికే రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన నిఖత్ జరీన్.. ఇప్పుడు మరోసారి ఫైనల్‌కు చేరి బంగారు పతకానికి కూతవేటు దూరంలో నిలిచింది. గురువారం జరిగిన పోరులో గెలిచి తుదిపోరుకు చేరడం ద్వారా నిఖత్ జరీన్ పతకాన్ని ఖాయం చేసుకుంది.మహిళల 51 కేజీల విభాగంలో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో బరిలో దిగిన నిఖత్ జరీన్.. ఉజ్బెకిస్థాన్ బాక్సర్ గనీవా గుల్సెవర్‌ను మట్టికరిపించింది. బాక్సింగ్ న్యాయనిర్ణేతలు అందరూ ఆమెను ఏకగ్రీవంగా విజేతగా ప్రకటించారు. దీంతో ప్రపంచ బాక్సింగ్ కప్ 2025 టోర్నీ ఫైనల్లో నిఖత్.. చైనీస్ తైపీకి చెందిన గువో జి జువాన్ తో బంగారు పతకం కోసం పోటీ పడనుంది. ఈ సందర్భంగా తెలంగాణకి చెందిన బాక్సర్ నిఖత్ జరీన్ మాట్లాడింది. "చాలా ఏళ్ల తర్వాత మళ్లీ నాకు మెడల్ దక్కడం హ్యాపీగా ఉంది. రాబోయే రోజుల్లో ఇదే విధంగా ముందుకు సాగుతా. గతంలో సొంత గడ్డపై ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచా. ఇప్పుడు ఈ టోర్నీ సెమీఫైనల్‌లో గెలిచి.. ఫైనల్‌లో గోల్డ్ మెడల్ సాధిస్తానని ధీమాగా ఉన్నా"నని నిఖత్ జరీన్ చెప్పుకొచ్చారు. ప్రపంచ బాక్సింగ్ కప్ ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు ఐదుగురు బాక్సర్లు ఫైనల్ చేరారు. వారిలో 57 కిలోల విభాగం సెమీస్‌లో జాస్మిన్ 5–0తో కజకిస్థాన్‌కు చెందిన సర్సెన్బెక్‌పై నెగ్గింది. 57 కిలోల విభాగంలో జాదుమణి సింగ్, 55 కిలోల విభాగంలో పవన్ బర్త్వాల్, 60 కిలోల విభాగంలో సచిన్ సివాచ్, 70 కిలోల విభాగంలో హితేశ్ గులియా కూడా ఫైనల్లో అడుగుపెట్టారు.



## ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్స్‌కు రెడీ

# పలువురు స్టార్ ప్లేయర్ల కోసం సిద్ధం



అబుదాబిలో డిసెంబర్ 16న ఐపీఎల్ 2026 మినీ వేలం జరగనుంది. ఇక పలువురు స్టార్ ప్లేయర్ల కోసం.. ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్స్‌కు రెడీ అవుతున్నాయి. అయితే ఈసారి చాలా మంది ఆటగాళ్లు వేలంలోకి వస్తుండగా.. వారిపై భారీ ధర పలికే ఛాన్స్ ఉంది. ఇప్పటివరకూ ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడైన రిషబ్ పంత్ రికార్డును కూడా బద్దలు కొట్టేందుకు.. ఓ ముగ్గురు ప్లేయర్లు లైన్‌లో సిద్ధంగా ఉన్నారు. ఐపీఎల్ 19వ సీజన్ వేలం డిసెంబర్ 16న అబుదాబిలో జరగనుంది. అయితే ఇది మినీ వేలం కావడంతో ఒకే రోజులో క్లోజ్ అవ్వనుంది. కామెరాన్ గ్రీన్ నుండి ఆండ్రీ రస్సెల్ వరకు.. పలువురు స్టార్ ఆటగాళ్ల కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్లకు సిద్ధమవుతున్నాయి. పంత్ పేరు మీదున్న రూ. 27 కోట్ల రికార్డు కూడా చెరిగే అవకాశం ఉంది.ఈ వేలంలో అందరి కంటే ముందున్న ఆటగాడు.. ఆస్ట్రేలియాకు చెందిన విధ్వంసక ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్. ఐపీఎల్ 2026 మినీ వేలంలోకి కామెరాన్ కూడా రానున్నాడు. ఐపీఎల్ 2024లో ఈ ప్లేయర్‌ని ఆర్సీబీ..ముంబై ఇండియన్స్ నుండి రూ. 17.5 కోట్లకు ట్రేడ్ చేసుకుంది. అయితే ఐపీఎల్ 2025 సీజన్‌లో కామెరాన్ గ్రీన్ గాయం కారణంగా ఆడలేకపోయాడు. కానీ ఈసారి ఫుల్ ఫామ్‌తో తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మెగా వేలంలో ఈ ఆటగాడి కోసం ఫ్రాంచైజీల మధ్య గట్టి పోటీ ఉండబోతోంది. కామెరాన్ గ్రీన్‌పై రూ. 25 కోట్ల వరకు బిడ్ పడే అవకాశం ఉంది. ఇక 2014 ఐపీఎల్ నుండి కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఆడుతున్న ఆండ్రీ రస్సెల్‌ను..ఈసారి రిలీజ్ చేయడంతో మినీ వేలంలోకి రాబోతున్నాడు. గత సీజన్‌లో ఈ ఆల్‌రౌండర్‌ను మెగా వేలంలో రూ. 12 కోట్లు చెల్లించి రిటైన్ చేసుకున్నారు. బ్యాట్, బాల్ రెండింటితోనూ మ్యాచ్‌ను మలుపు తిప్పగల సామర్థ్యం ఇతని సొంతం. అందువల్ల ఆండ్రీ రస్సెల్‌పై భారీ బిడ్ పడే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. గత సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడిన శ్రీలంక ఫాస్ట్ బౌలర్ మతీష పతిరానాను.. ఈసారి విడుదల చేసింది. ఐపీఎల్ 2025లో మతీషను రూ. 13 కోట్లు చెల్లించి రిటైన్ చేసుకున్నారు. ఈ సూపర్ బౌలర్‌కు డెత్ ఓవర్లలో వికెట్లు తీయగల అద్భుతమైన సామర్థ్యం ఉంది. మతీష పతిరానాపై కూడా రూ. 10 కోట్ల వరకు బిడ్ పడే ఛాన్స్ ఉంది.



# ఐపీఎల్ 19వ సీజన్‌కు రంగం సిద్ధం

## అబుదాబిలో డిసెంబర్ 16న వేలం

క్రికెట్ ప్రేమికులకు పండగలాంటి వార్త ఇది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఐపీఎల్ 19వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. రాబోయే ఐపీఎల్ 2026 కోసం మినీ వేలం వచ్చే నెల జరగనుంది. దీనికి సంబంధించిన తేదీ, వేదిక వివరాలను బీసీసీఐ తాజాగా ప్రకటించింది. ఈసారి వేలాన్ని విదేశాల్లోని అబుదాబిలోని ఎతిహాద్ అరేనాలో డిసెంబర్ 16న నిర్వహించనున్నారు. మినీ వేలానికి ముందు 10 జట్లు కలిసి మొత్తం 173 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకున్నాయి. వీరిలో 49 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. ఫ్రాంచైజీలు కొనుగోలు చేయడానికి ఇంకా 77 స్లాట్‌లు మిగిలి ఉన్నాయి. అన్ని జట్ల పర్సులలో కలిపి మొత్తం రూ.237.55 కోట్ల డబ్బు వేలంలో అందుబాటులో ఉంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం.. ఒక జట్టులో గరిష్టంగా 25 మంది ఆటగాళ్లు ఉండవచ్చు. పంజాబ్ కింగ్స్ 21 మందిని, గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్ చెరో 20 మందిని ఇప్పటికే రిటైన్ చేసుకున్నాయి. ఫ్రాంచైజీల వద్ద మిగిలిన డబ్బు లెక్కల ప్రకారం.. కోల్‌కతా నైట్ రైడర్స్ వద్ద అత్యధికంగా రూ.64.3 కోట్లు ఉన్నాయి. వీరు ఏకంగా 13 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చు. ఆండ్రే రసెల్, వెంకటేశ్ అయ్యర్ వంటి ఖరీదైన ఆటగాళ్లను కేకేఆర్ విడుదల చేయడం దీనికి కారణం. మరోవైపు, సన్‌రైజర్స్ హైదరాబాద్ పర్స్‌లో రూ.25.5 కోట్లు మిగిలాయి. అయితే ముంబై ఇండియన్స్ మాత్రం అతి తక్కువ మొత్తంతో వేలానికి వెళ్తోంది. ఆ జట్టు వద్ద కేవలం రూ.2.75 కోట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ వేలం ద్వారా కేకేఆర్ తమ జట్టును దాదాపు కొత్తగా నిర్మించుకోవడానికి మంచి అవకాశం ఉంది.



# రింకూ సింగ్ అద్భుతమైన సెంచరీ

భారత జట్టు దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడుతోంది. నవంబర్ 22న గౌహతిలో జరిగే రెండవ, చివరి మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. ఇంతలో, భారత స్టార్ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ రింకూ సింగ్ రంజీ ట్రోఫీలో తన బ్యాటింగ్‌తో సంచలనం సృష్టించాడు. రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో రింకూ సింగ్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. వరుసగా ఫోర్లు, సిక్సర్లు బాదాడు. భారత జట్టు తరపున టెస్ట్ క్రికెట్ ఆడటానికి తన సంసిద్ధతను కూడా అతను సూచించాడు.2025–26 రంజీ ట్రోఫీలో తమిళనాడుపై జరిగిన మ్యాచ్‌లో భారత యువ బ్యాట్స్‌మన్ రింకు సింగ్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. అతను 247 బంతులు ఎదుర్కొని 176 పరుగులు చేశాడు. రింకు సింగ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఉత్తరప్రదేశ్ తొలి ఇన్నింగ్స్ లో 460 పరుగులు చేసి తమిళనాడుపై ఐదు పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. రింకు తన ప్రత్యేకమైన స్వభావాన్ని ప్రదర్శించి మైదానం అంతటా అద్భుతమైన షాట్లు ఆడాడు. ఉత్తరప్రదేశ్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ రింకు సింగ్ క్లిష్ట పరిస్థితుల్లో ఈ సెంచరీ చేశాడు. రింకు సింగ్ బ్యాటింగ్‌కు వచ్చే సమయానికి ఉత్తరప్రదేశ్ 149 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత రింకు సింగ్ వచ్చి శివమ్ మావితో కలిసి అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. జట్టును బలమైన స్థితిలో ఉంచాడు.ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ అద్భుతమైన రంజీ ట్రోఫీ సీజన్‌తో దేశీయ క్రికెట్‌లో తన సెంచరీల సంఖ్యను పెంచుకున్నాడు. తరచుగా అగ్రశ్రేణి %ఓ‌ష%20 బ్యాట్స్‌మన్‌గా పేరుగాంచిన రింకు సింగ్, టెస్ట్ క్రికెట్ ఆడే తన సామర్థ్యాన్ని మరోసారి ప్రదర్శించాడు. అతను దేశీయ క్రికెట్‌లో తన తొమ్మిదవ సెంచరీని సాధించాడు. భారత టెస్ట్ జట్టులో స్థానం కోసం తన వాదనను కూడా పదిలం చేసుకున్నాడు. ఈ సెంచరీ సెలెక్టర్లకు కూడా ఒక ముఖ్యమైన సందేశాన్ని పంపింది. రింకు సింగ్ దేశీయ టెస్ట్ కెరీర్‌లో 57 సగటుతో 3600 పరుగులు సాధించాడు. ఈ కాలంలో అతను తొమ్మిది సెంచరీలు, 22 హాఫ్ సెంచరీలు సాధించాడు. ఈ గణాంకాలు అతను రెడ్-బాల్ క్రికెట్‌లో కూడా స్థిరంగా పరుగులు సాధిస్తున్నాడని సూచిస్తున్నాయి. భవిష్యత్తులో అతను భారత టెస్ట్ జట్టులో కూడా స్థానం సంపాదించవచ్చు.

# 99లకే రాజు వెడ్స్ రాంబాయి టిక్కెట్

టాలీవుడ్ నుంచి రాబోతున్న తాజా చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ సినిమా శుక్రవారం 21నప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ మూవీపై బంపరాఫర్‌ని ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమా టికెట్ ధరను తగ్గించినట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో సింగిల్ థియేటర్‌లలో ఈ చిత్రం రూ.99లకే అందుబాటులో ఉండబోతుండగా.. మల్టీప్లెక్స్‌లలో రూ.105గా నిర్ణయించినట్లు చిత్రబృందం తెలిపింది. తెలంగాణ రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రంలో అఖిల్, తేజస్విని జంటగా నటిస్తుండగా.. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాను వేణు వుడుగుల నిర్మిస్తుండగా.. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.




## అమీర్‌పేటలో అర్ధనగ్నంగా తిరుగుతా

### రాజు వెడ్స్ రాంబాయి డైరెక్టర్ సాయిలు

అఖిల్ రాజ్, తేజస్వి రావు జంటగా నటించిన 'రాజు వెడ్స్ రాంబాయి' నవంబర్ 21న శుక్రవరాం రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. ఈటీవీ విన్ ఒరిజినల్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమాకు సాయిలు కంపాటి స్టోరీ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం స్వయంగా నిర్వహించారు. ఇప్పటికే విడుదలైన ప్రతి అప్‌డేట్ మంచి అంచనాలు తీసుకొచ్చింది. అయితే తాజాగా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సాయిలు చేసిన కామెంట్స్ మాత్రం టాలీవుడ్‌లో పెద్ద చర్చగా మారాయి. మా సినిమా చిన్నదైనా, దాని వెనక ఉన్న ఎమోషన్ చాలా పెద్దది. పల్లెటూరి కథలు, అమాయకమైన ప్రేమ, ఊర్లో జరిగే నిజ జీవిత సంఘటనలు నాకు తెలుసు. నేను విమానం నుంచి దిగి వచ్చే హీరోల కథలు రాయలేదు. మన దగ్గర జరిగిన నిజమైన కథను తీసుకొచ్చా. ఈ సినిమా 15 ఏళ్ల పాటు నరకం చూసిన ఒక జంట నిజ జీవితాన్ని ఆధారంగా చేసుకున్నదని దర్శకుడు చెప్పారు. అలాగే సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయొద్దు, సినిమా నచ్చకపోతే వదిలేయండని అభిమానులకు కోరుతూ.. మా టీమ్ ఎంత కష్టపడిందో మీకు సినిమా చూస్తే అర్థమవుతుంది. మన కష్టానికి తగిన ఫలితం తప్పకుండా వస్తుందని అంటూ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయొద్దని కోరుతూ.. 'ఈ సినిమాకు నెగెటివ్ టాక్ వస్తే అమీర్‌పేట్ సెంటర్‌లో అర్ధనగ్నంగా తిరుగుతా!' అని ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సినిమా టీమ్ కష్టాన్ని నమ్మి ఇలాంటి ఛాలెంజ్ చేస్తున్నానని చెప్పారు. సాయిలు కంపాటి స్టేట్‌మెంట్ నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి సినిమాపైనే పడింది.



# ఎఐ మార్ఫింగ్ ఫోటోలతో నష్టం

### ఆందోళన వ్యక్తం చేసిన నటి కీర్తి సురేశ్

తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న ఎఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది.మార్ఫింగ్ చిత్రాలు నా మనసుకి చాలా బాధ కలిగించడమే కాకుండా.. చాలా విసుగు పుట్టిస్తున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో క్రియేట్ నకిలీ చిత్రాలు ఎంత నమ్మేలా ఉన్నాయంటే వాటిని చూసినప్పుడు నిజంగానే నేను అలా ఫోజు ఇచ్చానా? అని తనకు తాను ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి పేర్కొన్నారు. ఇది ఎఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారిందో తెలియజేస్తుందని కీర్తి తెలిపారు. ఎఐ సాంకేతికత సామర్థ్యాలు నానాటికీ పెరుగుతున్నాయని వీటిని నియంత్రించడం కష్టంగా మారుతోందని కీర్తి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా తమ ఇమేజ్‌లను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకు మాత్రమే పరిమితం కాలేదని సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉండే ఎవరికైనా ఇది ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని కీర్తి హెచ్చరించారు. ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా ఎఐ వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఎఐ సమస్యగా మారుతోంది. రష్మిక మందన్న, సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, ఎఐ దుర్వినియోగం పై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

# నేడు థియేటర్లలోకి అల్లరి నరేశ్ 12ఎ రైల్వే కాలనీ

టాలీవుడ్ యాక్టర్ అల్లరి నరేశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న థ్రిల్లర్ ప్రాజెక్ట్ '12ఎ రైల్వే కాలనీ'. నాని కాసరగడ్డ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో డాక్టర్ కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ చిత్రం 21న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అల్లరి నరేశ్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది.కాగా ఈ సస్పెన్స్ థ్రిల్లర్ ఇంకా థియేటర్లలోకి రాకముందే ఓటీటీ పార్ట్‌నర్‌ను ఫిక్స్ చేసుకుంది. ఈ మూవీ ఓటీటీ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియో భారీ మొత్తానికి దక్కించు కున్నట్టు టాలీవుడ్ సర్కిల్ సమాచారం. థియాట్రికల్ రన్ తర్వాత మేకర్స్ ఓటీటీ రిలీజ్ డేట్‌పై క్లారిటీ ఇవ్వనున్నారు. 12ఎ రైల్వే కాలనీలో సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ మూవీకి 'పొలిమేర', 'పొలిమేర 2' ఫేం డాక్టర్ అనిల్‌విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు సమకూరుస్తున్నారు. క్ను్వగా కామెడీ సినిమాలెందుకు చేయడం లేదని ప్రమోషన్స్‌లో అల్లరి నరేశ్‌ను ప్రశ్నించగా .. దీనికి అల్లరి నరేశ్ స్పందిస్తూ.. కామెడీ సినిమాలు తీయాలంటే ఇప్పుడు చాలా కష్టతరమైన పరిస్థితులు ఉన్నాయి. మేం ఒకవేళ ఇప్పుడు కితకితలు చేస్తే.. బాడీ షేమింగ్‌తో సినిమాను పక్కన పెట్టేస్తారు. ఇప్పుడు కొన్ని విషయాలు చాలా సున్నితంగా మారాయి. కొంతమంది మనోభావాలు దెబ్బతినే అవకాశముంది. ఈ రోజుల్లో మనం కలర్, బరువుతోపాటు ఇతర సున్నిత అంశాలపై మాట్లాడకూడదన్నాడు. ప్రేక్షకుల అభిరుచి ప్రతీ పది సంవత్సరాల కోసారి మారుతూ వస్తుంది. నేను గతంలో రైమింగ్ డైలాగ్స్, కౌంటర్స్‌తో సాగేకామెడీ సినిమాలు చేసేవాడిని. సుడిగాడు స్పూఫ్ సినిమా.ప్రేక్షకులు కూడా ప్రతీ కంటెంట్‌పై స్పూఫ్స్ చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. జోకులు ఖచ్చితంగా ఆర్గానిక్‌గా ఉండాలి. వాటిని సోషల్ మీడియా మీమ్స్‌ను నుంచి అస్సలు కాపీ చేయొద్దు. జనాలు ఇప్పుడు ఆర్గానిక్‌గా ఉండే సెన్సిబుల్ కామెడీని ఆశిస్తున్నారని చెప్పుకొచ్చాడు అల్లరి నరేశ్.




# చిరాకు పుట్టిస్తున్న ప్రీరిలీజ్ ఈవెంట్లు

### అవసరానికి మించి పొగడ్తలు అవసరమా

### -నటుడు, దర్శకుడు రవిబాబు



తనకు సినిమాలు మార్కెటింగ్ చేసుకోవడం రాదని నటుడు, దర్శకుడు రవిబాబు తెలిపారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లు చిరాకు తెప్పిస్తాయన్నారు. అలాంటి ఈవెంట్‌లు పెట్టి నటీనటులను అవసరానికి మించి పొగుడుతూనే ఉంటారని అలా ఎందుకు చేస్తారో ఇప్పటికీ తనకు అర్థం కాదన్నారు. అందుకే తాను ఈవెంట్‌లకు రానని చెప్పారు.కొన్ని సినిమాల్లో నన్ను విలన్‌గా చూసినవారు ఇప్పటికీ నేను ఎదురుగా కనిపిస్తే భయంతో వెళ్లిపోతున్నారు. సినిమాలు ప్రేక్షకులపై అంతగా ప్రభావం చూపుతాయి. అందుకే సున్నితమైన అంశాలను తెరకెక్కించేటప్పుడు మరింత జాగ్రత్త వహించాలని రవిబాబు చెప్పారు. తనకు మార్కెటింగ్ చేసుకోవడం తెలియదని దర్శకుడు రవిబాబు అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. హాస్యం కూడా ప్రాంతాన్ని బట్టి మారుతుందన్నారు. అందుకే తాను ఎక్కువగా విజువల్స్‌కు ప్రాధాన్యం ఉండేలా చూస్తానన్నారు.'అవును సినిమాలో ఆ హీరోయిన్ పెద్ద ఇబ్బందుల్లో పడుతుంది. దాన్ని విజువల్‌గా ఎలా చూపించాలి అని ఆలోచించి.. ఏనుగు పెద్ద జంతువు కాబట్టి ఏనుగంత ప్రాబ్లమ్‌లో హీరోయిన్ ఉంది అని చెప్పడం కోసం పోస్టర్ చేయించా. ఆ పోస్టర్ చూసి ఒక వ్యక్తి నాకు ఫోన్ చేసి తిట్టాడు. ఏనుగు ఉందని పిల్లల్ని తీసుకొని సినిమాకు వెళ్తే సినిమాలో ఏనుగు లేదన్నాడు. ఆయనకు సారీ చెప్పి పెట్టేశాను. ఈ సినిమా చూసి మరో మహిళ ఫోన్ చేశారు. శరీరం లేని వ్యక్తి, కళ్లకు కనిపించని వ్యక్తి హీరోయిన్‌ను ఎలా కలవాలని అనుకుంటాడు అని నాతో వాదించారు. ఆమెకు నేను ఆ సినిమా కథే అది అని వివరించలేకపోయాను'. 'ప్రేక్షకులు మనం తీసే సినిమాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి.



## కళ్యాణి ప్రియదర్శి కొత్త చిత్రం ప్రారంభం

కళ్యాణీ ప్రియదర్శన్ ఇవాళ మలయాళ చిత్ర సీమలో స్టార్ హీరోయిన్. అగ్ర కథానాయకుల సినిమాలను మించి పోయి... ఆమె నటించిన 'లోకా' పార్ట్ వన్ మూడు వందల కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. దీంతో ఒక్కసారిగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలకు క్రేజ్ పెరిగిపోయింది. ప్రస్తుతం కార్తీ సరసన 'మార్షల్' సినిమాలోనూ, 'జయం' రవి 'జీనీ'లోనూ ఆమె నటిస్తోంది. అలానే 'లోకా' మూవీ సక్సెస్ తర్వాత కళ్యాణీ ప్రియదర్శన్ తో సినిమా తీయడానికి చాలామంది మేకర్స్ తహతహలాడుతున్నారు.
ఇదిలా ఉంటే... పొటెన్షియల్ స్టూడియోస్ సంస్థ తన ఏడో సినిమాను కళ్యాణ్ ప్రియదర్శన్ తో మొదలు పెట్టింది. గతంలో 'మాయ, మానగరం, మాన్ స్టర్, తానక్కరన్, ఇరుగపాత్రు, బ్లాక్' వంటి విజయవంతమైన సినిమాలను ఈ నిర్మాణ సంస్థ రూపొందించింది. ఈ సినిమాలో 'నాన్ మహానల్లా' ఫేమ్ దేవదర్శిని, వినోద్ కిషన్ కీలక పాత్రలు పోషించబోతున్నారు. ఈ మూవీతో ధీరవియం ఎస్.ఎన్.



# జయకృష్ణ మూవీకి జివి ప్రకాశ్ సంగీతం

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేశ్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్న విషయం తెలిసిందే. జయకృష్ణను హీరోగా పరిచయం చేస్తూ ప్రముఖ నిర్మాత అశ్వినీదత్ సమర్పణలో 'జెమినీ' కిరణ్ మూవీని ప్రొడ్యూస్ చేస్తున్నారు. దీనికి 'ఆర్.ఎక్స్. 100' ఫేమ్ అజయ్ భూపతి దర్శకుడు. అజయ్ భూపతి 'ఆర్.ఎక్స్. 100' తర్వాత 'మహాసముద్రం', 'మంగళవారం' చిత్రాలను రూపొందించారు. దర్శకుడిగా ఇది ఆయనకు నాలుగో సినిమా. జయకృష్ణ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో అతని సరసన ప్రముఖ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. గతంలో రవీనా టాండన్ పలు తెలుగు చిత్రాలలో హీరోయిన్ గా చేసింది. రాషాకు మాత్రం ఇదో తొలి తెలుగు సినిమా. ఇక తాజాగా ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ కుమార్ ను సంగీత దర్శకుడిగా ఎంపిక చేసినట్టు మేకర్స్ తెలిపారు.అజయ్ భూపతి గతంలో దర్శకత్వం వహించిన సినిమాలకు చైతన్ భరద్వాజ్, అజనీశ్ లోకనాథ్ సంగీతం అందించారు. జీవీ ప్రకాశ్ కుమార్‌తో అజయ్ భూపతి వర్క్ చేయడం ఇదే మొదటిసారి. గడిచిన 19 సంవత్సరాలలో జీవీ ప్రకాశ్ కుమార్ వందకు పైగా సినిమాలకు సంగీతాన్ని అందించాడు. తెలుగులోనూ పలు చిత్రాలకు స్వరాలు సమకూర్చాడు. అయితే జయకృష్ణ హీరోగా పరిచయం కాబోతున్న సినిమాకు అతను సంగీతాన్ని అందించడం ప్రత్యేకతను సంతరించుకుంది. మరి ఈ సినిమా ఏ స్థాయిలో మ్యూజికల్ హిట్ గా నిలుస్తుందో చూడాలి.



## రజనీకి హెచ్‌టి అత్యున్నత గౌరవం

### 50 ఏళ్ల సినీ ప్రస్థానంపై ఫ్రంట్ పేజీలో ఫోటో

అగ్ర కథానాయకుడు రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ ఆంగ్ల పత్రిక హిందుస్థాన్ టైమ్స్ ఫ్రంట్ పేజీలో ఆయన ఫొటోను ముద్రించారు. ఈ పత్రిక స్థాపించిన వందేళ్లలో ఇలా ఒక పేజీ మొత్తం హీరో ఫొటోను ముద్రించడం తొలిసారి కావడం విశేషం. రజనీకాంత్ ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హిందుస్థాన్ టైమ్స్ తలైవాను ఇలా గౌరవించింది. సినీ ఇండస్ట్రీని ఎంతో ప్రభావితం చేసిన వ్యక్తికి ఇలాంటి గౌరవాన్ని కల్పించడం ఆనందంగా ఉందని పత్రిక పేర్కొంది. నవంబర్ 19న పేపర్‌లో రజనీ ఫొటో చూసి పాఠకులు ఆశ్చర్యపోయారు. ఇది ఆయనకు ఇచ్చిన గొప్ప గౌరవం అంటూ ఆనందం వ్యక్తంచేశారు. దీనిపై రజనీకాంత్ కూడా స్పందించారు. అద్భుతమైన సర్‌ప్రైజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన హృదయం ఆనందంతో నిండిపోయిందన్నారు. తనపై చూపుతోన్న ప్రేమాభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. 1975లో 'అపూర్వ రాగంగళ్'తో సినీ రంగప్రవేశం చేసిన రజనీకాంత్ ఎన్నో హిట్ సినిమాల్లో నటించి తన స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. ఈ నెలలో గోవా వేదికగా జరగనున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి – 2025) ముగింపు వేడుకల్లో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685